
# మరణానంతరం జరిగేది-1

రచన : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



# మరణానంతరం జరిగేది-1



**రచన & ప్రచురణ: బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు, B.Sc.,**

మొదటి ముద్రణ : ఆగస్టు, 2026
ప్రతులు : 1,000

**వెల : రూ. 60/-**

**పుస్తకముల కొరకు :-**
**తటవర్తి వీరరాఘవరావు,**
**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.**
**సెల్ : 94901 71853, 9440309812**

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) ఆత్మ పరిణామక్రమం | - | రూ.70/- |
| 11) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 12) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 13) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 14) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 15) పంచకోశాలు | - | రూ.60/- |
| 16) మనస్సు యొక్క స్థితులు | - | రూ.60/- |
| 17) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 18) జీవితం ధన్యం చేసుకోవాలంటే? | - | రూ.60/- |
| 19) జన్మరాహిత్య స్థితికి మార్గం | - | రూ.60/- |
| 20) ఆత్మగా జీవించ లేకపోవడానికి కారణాలు | - | రూ.60/- |
| 21) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 22) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 23) చిత్తం శాంతిగా వుండాలంటే? | - | రూ.50/- |
| 24) విషయ కర్మలు-శ్రేయోకర్మలు | - | రూ.50/- |
| 25) బాహ్య మౌనం - అంతర్ మౌనం | - | రూ.50/- |
| 26) అహంకారం ఎలా పోతుంది | - | రూ.50/- |
| 27) మానవుల్లో అసంతృప్తికి కారణం | - | రూ.50/- |
| 28) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 29) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |

# “మరణానంతర జీవితం మీద ఎంత అవగాహన ఉంటే, లక్ష్యానికి అంత దగ్గరవుతారు”

“మరణానంతర జీవితం మీద ఎంత అవగాహన ఉంటే, మీ లక్ష్యానికి అంత దగ్గరవుతారు” అంటే ప్రతి ఒక్కరికీ ఒక లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్యాన్ని సాధించే వరకు ఈ జీవితం, ఈ జన్మలు కొనసాగుతూనే ఉంటాయి. జన్మ లేని స్థితి అంటే మోక్ష స్థితి సాధించాలంటే లక్ష్యాన్ని చేరుకోవాలి.

మరి ఈ లక్ష్యాన్ని ఎవరు త్వరగా సాధిస్తారు? అదే ఈ సందేశంలో చెప్పబడింది. అంటే

“మరణానంతర జీవితం మీద అవగాహన ఉండాలి”

ఈ సందేశం ద్వారా మనకు ఇంకో విషయం కూడా అర్థమవుతుంది. జీవితం రెండు రకాలుగా ఉంటుంది:

1. మరణానికి ముందు ఉండే జీవితం.
2. మరణానంతరం ఉండే జీవితం.

ప్రతి ఒక్కరికీ మరణానికి ముందు ఉండే జీవితం గురించి కొంత అవగాహన ఉంటుంది, కానీ మరణానంతర జీవితం గురించి పూర్తిగా అవగాహన ఉండదు. జన్మ లేని స్థితి, అంటే మోక్షం, అంటే లక్ష్యసాధన ఇవి ఎప్పుడు సాధ్యమవుతాయి అంటే, మరణానంతర జీవితం మీద అవగాహన ఉన్నప్పుడు మాత్రమే.

విచిత్రం ఏమిటంటే, ఎన్నో జన్మలు ఈ అవగాహన లేకుండానే గడిచిపోతాయి. నిజంగా ఈ అవగాహన సంపాదించుకోకపోతే జన్మలు అలా పెరుగుతూనే ఉంటాయి. అందుచేత జన్మ లేని స్థితి సాధించాలని అనుకునేవారు ముందుగా మరణానంతర జీవితం గురించి తెలుసుకోవాలి. ఎంత చదువుకున్న వారైనా, ఎంత గొప్ప పండితులైనా, మేధావులైనా వారికి సాధారణంగా

మరణానికి ముందు ఉన్న జీవితం గురించే అవగాహన ఉంటుంది. కానీ మరణించిన తర్వాత ఉండే జీవితం గురించి అవగాహన ఉండదు. అందువల్ల వారు ఎంత గొప్పవారైనా, మోక్షాన్ని సాధించలేరు.

మరి ఈ అవగాహన ఎలా వస్తుంది? మరణానంతర జీవితం గురించి లోతుగా అధ్యయనం చేయాలి. అందుకే నా క్లాసుల్లో నేను ఎక్కువగా ఈ విషయంపైనే దృష్టి పెడుతూ ఉంటాను. మీకు కూడా నేను చెప్పేది ఏమిటంటే మీరు ఎంతో ఎదగవలసిన వారు, ఇంకా ఎన్నో తెలుసుకోవాల్సిన వారు కాబట్టి ఈ విషయంపైన కూడా ఎక్కువ శ్రద్ధ పెట్టండి. మరణానంతర జీవితం గురించి లోతుగా అధ్యయనం చేయండి. దాని మీద నేను ఎన్నో పుస్తకాలు కూడా వ్రాశాను. అవన్నీ బాగా చదవండి, ఇంకా వీలైతే మరింత తెలుసుకోవడానికి ప్రయత్నించండి. ఎక్కడికి వెళ్ళినా దీన్ని కూడా ఒక ముఖ్యమైన టాపిక్‌గా తీసుకోండి. చాలామంది క్లాసులో "ఏం చెప్పాలి?" అని ఆలోచిస్తూ ఉంటారు, కానీ మీరు చెప్పే గంట, రెండు గంటల క్లాసుల్లో ఈ విషయాన్ని కూడా చక్కగా, అనర్గళంగా వివరించగలుగుతారు.

ఇప్పుడు మరణానంతర జీవితం గురించి కొంత అవగాహన చేసుకుందాం. మరణానికి ముందు ఉండే జీవితం మీ కళ్ళకు కనిపిస్తుంది, ఇంద్రియాలకు తెలుస్తుంది. కానీ మరణానంతర జీవితం కనిపించదు, అందువల్ల దాని గురించి అవగాహన ఉండదు. కొంతమంది "చనిపోయాక ఇంకేమీ ఉండదు" అని అనుకుంటారు, అంత అమాయకంగా ఉంటారు. మేధావులు కూడా కొన్నిసార్లు అదే భావంలో ఉంటారు. కానీ యోగులకు, జ్ఞానులకు మరణానంతర జీవితం గురించి మంచి అవగాహన ఉంటుంది. ఎందుకంటే మరణించిన తర్వాత శరీరం ఉండదు, కానీ ఆత్మ ఉంటుంది. కానీ ఆత్మ కనిపించదు, అందువల్ల ఆత్మ గురించి అవగాహన తక్కువగా ఉంటుంది.

అలాగే మరణించిన తర్వాత ఆత్మ చేరుకునే లోకాలు కూడా కనిపించవు, అందువల్ల వాటి గురించి కూడా తెలియదు. ఆ లోకాలలో ఉన్న మాస్టర్స్ గురించి కూడా తెలియదు. చాలామంది శరీరంతో ఉన్నవారినే "మానవులు" అనుకుంటారు. కానీ శరీరం లేకపోయినా ఆత్మ ఉంటుంది, ఇంకా ఆరు శరీరాలు ఉంటాయి, వాళ్ళంతా కూడా మానవులే. కానీ కనిపించరు, అలాగే కనిపించని లోకాలలో ఎన్నో కౌన్సిలింగ్లు జరుగుతాయి.

అక్కడ ఉన్న ఉన్నత లోకాల వారు క్రింది లోకాల వారికి అవగాహన కల్పిస్తారు. వారి కర్తవ్యాలు, సాధించవలసిన విషయాలు బోధిస్తారు. భూమ్మీద ఉన్నప్పుడు సాధించని విషయాలను అక్కడ గుర్తుచేస్తారు. "భూమ్మీదకు వెళ్ళిన తర్వాత భోగాల కోసం కాకుండా జ్ఞానం సంపాదించు, సద్గురువును ఆశ్రయించు, ఆధ్యాత్మికంగా ఎదుగు" అని ఎన్నో మార్గదర్శకాలు ఇస్తారు. కానీ భూమ్మీదకి వచ్చిన తర్వాత అవన్నీ మర్చిపోతారు, మళ్ళీ కనిపించే విషయాలకే ప్రాముఖ్యం ఇస్తారు.

ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే మీరు చేసే ప్రతి కర్మ కూడా ఆకాశిక్ రికార్డ్స్‌లో నమోదవుతుంది. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు మీరు చేసే ప్రతి పని, మాట్లాడే ప్రతి మాట అన్నీ రికార్డు అవుతుంటాయి. ఒక రోజు వాటి ఫలితాలను అనుభవించాల్సి వస్తుంది. కానీ ఇది తెలియకపోవడం వల్ల మనుషులు తప్పులు చేస్తూనే ఉంటారు. తర్వాత కష్టాలు వచ్చినప్పుడు "నా జీవితం ఇలా ఎందుకు అయింది?" అని బాధపడుతుంటారు. కానీ గతంలో చేసిన కర్మల ఫలితమే ఇప్పుడు అనుభవిస్తున్నారని అర్థం చేసుకోరు.

అందుకే గౌతమ బుద్ధుడు చెప్పారు: **"పాపం చేసేటప్పుడు సుఖ భ్రాంతి ఉంటుంది, కానీ ఆ పాప ఫలితాన్ని అనుభవించేటప్పుడు జీవితం దుర్భరంగా మారుతుంది."** మాంసాహారం తినేటప్పుడు రుచిగా అనిపిస్తుంది. కోడిని

తిన్నప్పుడు ఎంతో రుచిగా ఉందని, మసాలాలు వేసుకుని ఎంతో ఆస్వాదిస్తూ తింటారు. తినని వారిని తక్కువగా చూస్తారు. “పలావు తినకుండా పప్పు అన్నం తింటావా?” అని ఎగతాళి చేస్తారు. “పలావులు తింటారు కానీ పచ్చ గడ్డి తింటారా?” అని వ్యంగ్యంగా మాట్లాడుతారు. తోటకూర, గోంగూర వంటి సాత్విక ఆహారం తినేవారిని కూడా పనికిరాని వారిలా చూస్తారు. “మీరు అసలు మనుషులేనా?” అని కూడా అంటుంటారు. కానీ దాని కర్మ ఫలితాలు ఎంత తీవ్రంగా ఉంటాయో తర్వాత తెలుస్తుంది. సృష్టిలో వున్న ఆకాశిక్ రికార్డ్స్ కనిపించవు, అందువల్ల వాటి ప్రభావంపై అవగాహన ఉండదు.

ఇంకా మనుషులు డబ్బు సంపాదించడానికి ప్రయత్నిస్తారు కానీ జ్ఞానం సంపాదించడానికి ప్రయత్నించరు, డబ్బే జీవితం అనుకుంటారు. కానీ మరణానంతర జీవితం గురించి అవగాహన ఉన్నవాడు జీవించవలసిన విధంగా జీవిస్తాడు. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే మరణించిన తర్వాత కూడా జీవితం వుంటుంది. కానీ శరీరం వుండదు.

మళ్ళీ జన్మ తీసుకోవాల్సి వస్తుంది. ఈ విషయాలు తెలియక చాలా మంది “ఎంజాయ్ చేస్తే జీవితం వెళ్ళిపోతుంది” అని అనుకుంటారు. కానీ ఇప్పుడు చేసిన కర్మల ఫలితాన్ని మళ్ళీ జన్మ తీసుకుని అనుభవించవలసి వస్తుంది అన్న అవగాహన ఉంటే, దానికి తగ్గట్టుగా జీవిస్తారు. అలాగే మరలా జన్మ తీసుకునే ముందు భూమి మీదకు వచ్చి ఏమి చేయాలి అన్న కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. కానీ వారు ఏమి నిర్ణయాలు తీసుకున్నారో వీరికి కనిపించదు, తెలియదు. భూమి మీదకు వచ్చిన తర్వాత అవన్నీ మర్చిపోవడం వల్ల వాటి గురించి పట్టించుకోరు, అవగాహన ఉండదు, చేయాల్సిన పనులు చేయరు, దాంతో ఎంతో నష్టపోతారు.

అలాగే, భూమి మీద ఎటువంటి కర్మలు చేసినవాడు ఎటువంటి లోకాలకి చేరుకుంటాడు అన్నది కూడా కనిపించదు, అందుచేత అది కూడా

తెలియదు. ఇన్ని విషయాలు కనిపించకపోవడం వల్ల, ఇవేమీ తెలియకపోవడం వల్ల, వాటిని అసలు దృష్టిలో పెట్టుకోకుండా జీవిస్తారు.

అలా జీవించడం వల్ల ఎంతో నష్టపోతారు, కష్టాల పాలవుతారు, జన్మలు పెంచుకుంటారు, నరకాన్ని అనుభవిస్తూ ఉంటారు. భూమ్మీదకు వచ్చే ముందు కొన్ని నిర్ణయాలు కూడా తీసుకుంటారు "ఏం సాధించాలి?", "ఏం నేర్చుకోవాలి?" అని. కానీ జన్మ తీసుకున్న తర్వాత అవన్నీ మర్చిపోతారు. అందుకే జీవితాన్ని కేవలం భార్య, భర్త, పిల్లలు, సంపాదన కోసం మాత్రమే వృథా చేసుకుంటారు. శరీరం విడిచిన తర్వాతే "ఎంత సమయం వృథా చేశాను!" అని అర్థమవుతుంది.

అందుచేత ఎవరైనా సరే మరణానంతర జీవితం మీద అవగాహన ఉండాలి, అప్పుడే జీవించవలసిన విధంగా జీవిస్తారు, సాధించవలసింది సాధిస్తారు. వాళ్ళ లక్ష్యం ఏంటో కూడా అవగాహన కలుగుతుంది, ఆ లక్ష్యం వైపు ప్రయాణిస్తారు లక్ష్యాన్ని సాధిస్తారు.

నేను వ్యాపారం వదిలి ఈ మార్గంలోకి వచ్చినప్పుడు చాలామంది నన్ను విమర్శించారు. కానీ జ్ఞానం పెరిగే కొద్దీ నాకు స్పష్టంగా అర్థమైంది నిజమైన తెలివి ఈ మార్గంలోకి రావడంలోనే ఉంది. ఎంతో మంది జీవిత మంతా పనికిరాని విషయాల కోసం ఖర్చు చేస్తున్నారు, చివరికి చేయవలసినవి ఏమీ చేయలేరు.

అందుకే నేను ఎప్పుడూ చెబుతుంటాను: కనీసం 25% అయినా మరణానంతర జీవితం మీద అవగాహన పెంచుకోండి, 50% సాధిస్తే గొప్ప వారు. 75% సాధిస్తే మిమ్మల్ని మించినవారు ఉండరు. మీరు మరణానంతర జీవితం గురించి ఎంత అవగాహన పెంచుకుంటారో, మీ ప్రవర్తనలో, మాటల్లో, జీవితంలో అంత మార్పు వస్తుంది. మీ లక్ష్యం ఏమిటో అర్థమవుతుంది. ఆ లక్ష్యం వైపు ప్రయాణిస్తారు, చివరకు దాన్ని సాధిస్తారు కూడా.

అయితే ఆ లక్ష్యం ఏమిటి? పూర్ణాత్మ స్థితిని చేరుకోవడం, పూర్ణ జ్ఞానాన్ని సంపాదించుకోవడం. ఆ లక్ష్యాన్ని సాధించడానికి అత్యంత అవసరమైనది మరణానంతర జీవితం మీద స్పష్టమైన అవగాహన ఎంత పెరుగుతుందో, అంతగా మీరు మీ అసలు గమ్యానికి చేరువ అవుతారు. మరణానంతర జీవితం గురించి అవగాహన లేకుండా, ఈ ప్రపంచంలో ఎన్ని విద్యలు నేర్చుకున్నా, ఎన్ని సంపదలు సంపాదించినా, ఎన్ని విజయాలు సాధించినా వాటి వల్ల ప్రయోజనం ఉండదు. “పునర్జన్మలు”, “సూక్ష్మ శరీర యానం”, “మూడు గుణాలు” వంటి ఎన్నో విషయాలు వింటూ వుంటారు. కానీ వాటి వెనుక ఉన్న నిజమైన అర్థం, లోతైన అవగాహన చాలామందికి ఉండదు.

అందుకే ప్రాపంచిక విద్యలతో పాటు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని కూడా సంపాదించుకోవాలి. ప్రాపంచిక జీవితం అవసరమే, కానీ దానితో పాటు మరణానంతర జీవితం మీద అవగాహన కలిగి ఉండటం కూడా అంతే ముఖ్యం. ఎందుకంటే కనిపిస్తున్న ఈ శరీరం మీరు కాదు, మీరు ఆత్మ. మీ పేరు మీరు కాదు, మీ ఆకారం మీరు కాదు, ఈ శరీరం కూడా మీరు కాదు, “నేను” అనే భావం వచ్చినప్పుడు, “నేను ఆత్మను” అనే సత్యాన్ని గుర్తు పెట్టుకోవాలి.

ఆత్మైన మీరు మీ స్వలోకం నుండి ఈ భూలోకానికి వచ్చారు, ఒక తల్లి గర్భాన్ని ఎంచుకుని ఈ జన్మను తీసుకున్నారు. ఎందుకు వచ్చారు? మీ స్వలోకంలో మరింత ఉన్నత స్థితిని పొందడానికి, ఆధ్యాత్మికంగా ఎదగడానికి, జ్ఞానాన్ని సంపాదించడానికి వచ్చారు.

మీ అవగాహన కోసం మీరు “పర లోకం” అని అంటున్నది నిజానికి మీ స్వలోకమే. ఆ స్వలోకంలో ఉన్నతిని పొందడానికి ఈ భూలోకానికి వచ్చారు. ఇక్కడ కొంతకాలం ఉండేందుకు ఈ శరీరాన్ని ధరించారు. ఇక్కడ అనుభవాల

ద్వారా జ్ఞానం సంపాదించి, ఆ జ్ఞానం ద్వారా ఆత్మను ఉన్నత స్థితికి తీసుకెళ్ళడమే ఈ జన్మ యొక్క అసలు ఉద్దేశ్యం.

ఈ రోజుల్లో ఎంతోమంది విదేశాలకు వెళ్తున్నారు అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, అరబ్ దేశాలు ఇలా ఎన్నో ప్రాంతాలకు వెళ్తున్నారు. ఎందుకు వెళ్తున్నారు? మెరుగైన జీవితం కోసం, సంపాదన కోసం, కుటుంబ భవిష్యత్తు కోసం. కొన్నేళ్లు కష్టపడి సంపాదించి తిరిగి వచ్చి ఇళ్ళు కడతారు, భూములు కొనుగోలు చేస్తారు, స్థిరపడతారు.

అదే విధంగా ఆత్మ కూడా తన స్వలోకంలో ఉన్నతిని పొందడానికి ఈ భూలోకానికి వస్తుంది, ఇక్కడ అనుభవాల ద్వారా జ్ఞానం సంపాదిస్తుంది. ఆ జ్ఞానం సంపాదించిన తర్వాత ఈ శరీరాన్ని విడిచిపెట్టి తిరిగి తన స్వస్థానానికి చేరుకుంటుంది. ఇక్కడ ఎంత ఎక్కువ జ్ఞానం సంపాదిస్తే, అక్కడ అంత ఉన్నతమైన లోకాలను చేరుకోగలుగుతుంది. విదేశాలకు వెళ్ళి వచ్చిన వ్యక్తి గొప్ప భవనం కడితే, “ఎంత గొప్పగా ఎదిగాడు” అని అందరూ చెప్పుకుంటారు. అలాగే భూమ్మీద జ్ఞానం సంపాదించి ఉన్నత లోకాలకు చేరుకున్న ఆత్మను కూడా అక్కడ గొప్పగా గౌరవిస్తారు.

కానీ మీకు మరణానంతర జీవితం మీద సరైన అవగాహన లేకపోవడం వల్ల, ఈ విషయాల మీద ఎక్కువ దృష్టి పెట్టడం లేదు. అందుకే చెబుతున్నాను మీరు నిజంగా వివేకవంతులైతే, మీ జీవితంలో కొంత సమయాన్ని ఈ ఆధ్యాత్మిక జ్ఞానం కోసం కేటాయించాలి. లేకపోతే “నా కుటుంబం”, “నా ఉద్యోగం”, “నా సంపాదన”, “నా పిల్లలు” ఇవే జీవితమని భావిస్తూ కాలం గడిపేస్తారు.

ఆది శంకరాచార్యులు గారు కూడా చెప్పారు “ఎవరు నీ తండ్రి? ఎవరు నీ భార్య? ఎవరు నీ భర్త? ఎవరు నీ పిల్లలు?” అని ఆలోచించమన్నారు. ఎందుకంటే ఈ సంబంధాలన్నీ శరీరానికి సంబంధించినవి మాత్రమే. ఆత్మ

స్థాయిలో చూస్తే, ప్రతి ఒక్కరూ తమ తమ ప్రయాణంలో ఉన్న ఆత్మలే. ఎవరి ప్రణాళిక వాళ్లది, ఎవరి కర్మ వాళ్లది.

కానీ మనిషి ఈ తాత్కాలిక సంబంధాల కోసమే జీవితాంతం శ్రమిస్తూ, ఎన్నో పాపాలు చేస్తూ, అబద్ధాలు చెబుతూ, కొత్త కర్మలను కూడబెట్టుకుంటూ జీవిస్తున్నాడు. ఇదెంత విచిత్రమో ఆలోచించండి. అందుకే మరణానంతర జీవితం మీద అవగాహన పెంచుకోవాలి. లేదంటే "ఇదే శాశ్వత జీవితం" అని భావించి మాయలోనే మునిగిపోతారు.

షిరిడి సాయిబాబా కూడా చెప్పారు "మోక్షం పొందాలనే తీవ్ర తపన ఉన్నప్పుడే ఈ మార్గంలో మనిషి నిజమైన శ్రద్ధతో ముందుకు సాగుతాడు" అని. జరుగుతున్నదంతా ఒక కల లాంటిదే అని గుర్తుపెట్టుకోండి, మీరు ఇప్పుడు ఎంతో నిజం అనుకుంటున్న ఈ ప్రపంచం కూడా ఒక రోజు కలలా అనిపిస్తుంది. కలలో ఎన్నో జరుగుతాయి డబ్బు ఉన్న భర్తను చేసుకున్నట్టు, భోగాలన్నీ అనుభవిస్తున్నట్టు, పిల్లలను కన్నట్టు కనిపిస్తుంది. కానీ కళ్ళు తెరిచిన వెంటనే అంటే మెలకువ రాగానే ఎవరూ ఉండరు.

అప్పుడు అది నిజం కాదని అర్థమవుతుంది. ఇప్పుడు కూడా "ఇది నిజంగానే జరుగుతోంది కదా?" అని మీరు అనొచ్చు. "మా పిల్లలు ఉన్నారు... మా భర్త ఉన్నారు... మా భార్య ఉంది... చూపించమంటారా?" అని అడగొచ్చు. అవును... ఇప్పుడు ఉన్నట్టుగానే కనిపిస్తున్నారు. కానీ ఒకసారి మరణం వచ్చిన తర్వాత ఎవరుంటారు చెప్పండి?

ఎంతో మందికి భర్తలు దూరమయ్యారు, ఎంతో మందికి భార్యలు దూరమయ్యారు, తల్లిదండ్రులు దూరమైన వాళ్ళు ఉన్నారు, తాతలు, అమ్మమ్మలు, బంధువులు దూరమైన వాళ్ళు ఉన్నారు వాళ్లంతా ఇప్పుడు ఎక్కడున్నారు?

ఒకప్పుడు ఉన్నట్టే ఉన్నారు... మాట్లాడారు... నవ్వారు...

జీవించారు... కానీ కాల గమనంలో ఆవిరైపోయారు. అయినా మనిషి వాళ్ళ కోసం ఆరాటపడుతూనే ఉంటాడు. ఎందుకు అంత ఆరాటం? ఎందుకంటే "ఇదే శాశ్వతం" అనే మాయలో మనిషి జీవిస్తున్నాడు కాబట్టి.

కానీ నిజానికి ఈ ప్రపంచంలోని ప్రతి సంబంధం, ప్రతి అనుభవం, ప్రతి సంఘటన కాలంతో కలిసి మారిపోతూ ఉండే ఒక తాత్కాలిక అనుభవం మాత్రమే. ఈ సత్యాన్ని అర్థం చేసుకున్నప్పుడే మనిషిలో వైరాగ్యం, ఆత్మజ్ఞానం పట్ల ఆసక్తి ప్రారంభమవుతుంది.

మోక్షాన్ని పొందాలనే తీవ్రమైన కాంక్షనే "ముముక్షుత్వం" అంటారు. ఆ తపన ఉన్నప్పుడే శ్రద్ధ వస్తుంది, పట్టుదల వస్తుంది, నిరంతర కృషి ప్రారంభమవుతుంది. శ్రద్ధ, పట్టుదల, కృషి ఈ మూడు ఆధ్యాత్మిక మార్గంలో అత్యంత ముఖ్యమైనవి. ఏ లక్ష్యాన్ని సాధించాలన్నా అవిశ్రాంతంగా కృషి చేయాలి, ఎందుకంటే మీ అసలు లక్ష్యం ఈ భవ సాగరం నుండి బయటపడటం. ఎన్నో జన్మలుగా "నా వారు", "నా కుటుంబం" అనే బంధాలలోనే తిరుగుతూ ఉన్నారు.

మీ బుద్ధి ఎలా ఉంటే, మీ నిర్ణయాలు కూడా అలాగే ఉంటాయి. అశుద్ధ బుద్ధి మిమ్మల్ని ప్రాపంచిక విషయాల వైపు తీసుకెళ్తుంది. శుద్ధ బుద్ధి మిమ్మల్ని ఆధ్యాత్మికత వైపు నడిపిస్తుంది. ఈ ప్రపంచం మాయా ప్రపంచం, మాయ అంటే లేనిది ఉన్నట్టుగా అనిపించడం, తాత్కాలికమైన వాటిని శాశ్వతమని భావించడం. డబ్బు శాశ్వతం కాదు, శరీరం శాశ్వతం కాదు, సంబంధాలు కూడా శాశ్వతం కావు. అయినా వాటి కోసమే మనిషి ఎన్నో తప్పులు చేస్తూ, కర్మలను పెంచుకుంటూ జీవిస్తున్నాడు.

అందుచేత మీ జీవితంలో కొంత సమయాన్ని మరణానంతర జీవితం గురించి తెలుసుకోవడానికి కేటాయించండి. మీ లక్ష్యం పూర్ణాత్మ స్థితిని చేరుకోవడం. జ్ఞానం పెరిగితే కర్మలు తగ్గుతాయి, కర్మలు తగ్గితే గమ్యానికి

చేరువ అవుతారు.

జీవితం అనేది కేవలం సుఖంగా గడపడానికి మాత్రమే కాదు. ప్రతి జన్మ ఒక పాఠం, ప్రతి అనుభవం ఒక జ్ఞాన సాధన, ఆ జ్ఞానం ద్వారానే ఆత్మ ఎదుగుతుంది. అందుకే రాబోయే రోజుల్లో మరణానంతర జీవితం మీద మరింత అవగాహన పెంచుకునే ప్రయత్నం చేయండి. ఇది ప్రతి మనిషి జీవితానికి అత్యంత అవసరమైన విషయం.

మానవులు ఎంతసేపు మరణించక ముందు ఉండే జీవితం గురించే ఆలోచిస్తున్నారు. కానీ మరణించిన తర్వాత ఉండే జీవితం గురించి ఎవ్వరూ ఆలోచించడం లేదు. అసలు అది ఉంటుంది అన్నట్టుగా కూడా ప్రవర్తించడం లేదు. ఎందుకంటే మరణించక ముందు ఉండే జీవితం కనిపిస్తుంది, కానీ మరణించిన తర్వాత ఉండే జీవితం ఈ కంటికి కనిపించదు. ఈ కంటికి కనిపించని వాటి గురించి తెలుసుకునే శక్తి జ్ఞానులకే ఉంటుంది, జ్ఞానం ఉన్నవారికే ఉంటుంది. అసలు జ్ఞానం అంటేనే కంటికి కనిపించని దాని గురించి తెలుసుకోవడం, అందుకే జ్ఞాని గొప్పవాడు అంటారు.

జ్ఞానం ఉన్నవారికి అంత విలువ, అంత గౌరవం ఎందుకంటే, మరణానంతర జీవితం మీద ఎంత అవగాహన ఉంటే, మీరు మీ లక్ష్యానికి అంత దగ్గరైనట్టే.

మీ లక్ష్యం ఏమిటి? మీరు శరీరమే అనుకుంటే మీకు లక్ష్యం ఏముంటుంది? బాగా డబ్బు సంపాదించాలి, పెద్ద మేడ కట్టాలి, కారు కొనుక్కోవాలి, ఎంతో డెకరేషన్ చేసుకోవాలి, భోగాలు అనుభవించాలి, సుఖపడాలి ఇదే ఆలోచన ఉంటుంది. ఒకవేళ డబ్బు సంపాదించినా బాగా పదవులు కావాలి, పెద్ద ఉద్యోగం కావాలి, రాజకీయాల్లో పేరు తెచ్చుకోవాలి, లేదా సినిమా యాక్టర్ అవ్వాలి, సింగర్ అవ్వాలి, ఆటల్లో నైపుణ్యం సంపాదించాలి ఇలాంటివే లక్ష్యాలు ఉంటాయి. అవి లక్ష్యాలు అనుకుంటారు

కాబట్టే వారి జీవితమంతా దానికే కేటాయిస్తారు.

ఖాళీ దొరికితే చాలు సంగీత విద్వాంసులు సంగీతంలో నైపుణ్యం కోసం ఎంత కృషి చేస్తారో చూడండి. వీణ వాయించేవారు, ఫ్లూట్ వాయించే వారు, మృదంగం వాయించేవారు ఇలా ఎన్నో రకాల సంగీత నైపుణ్యం పొందిన వారు ఉన్నారు. మీరు వాళ్ళను గమనిస్తే, జీవితమంతా దానికే అంకితం చేస్తారు, అందులో అపారమైన నైపుణ్యం సంపాదిస్తారు. కొంతమంది గాత్ర సంగీతంలో పేరు తెచ్చుకుంటారు, అలాంటి వారిని జనాలు ఎప్పటికీ మర్చిపోలేరు. ఘంటసాల, సుశీల, హిందీలో మహమ్మద్ రఫీ, లతా మంగేష్కర్ వీరంతా జీవితమంతా సంగీతంపైనే కృషిచేశారు కాబట్టే అంత పేరు సంపాదించారు.

ఈ దేహమే నేను అనుకుంటే, ఏదో ఒక ప్రొఫెషన్‌లో నైపుణ్యం కోసం జీవితమంతా ప్రయత్నిస్తారు. కానీ మీరు దేహం కాదు, ఆత్మ అని అర్థమైన రోజున మీ లక్ష్యం ఏమిటో అర్థమవుతుంది! అసలు "నేను ఆత్మ" అన్న సంగతే తెలియకపోతే ఈ లక్ష్యం ఎలా తెలుస్తుంది? ఎప్పుడైతే "నేను ఆత్మ" అన్నది మీకు అర్థమవుతుందో, అప్పుడు ఆత్మ గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. అసలు ఆత్మ అంటే ఏమిటి? ఆత్మ ఎలా ఉంటుంది? ఆత్మ ఎక్కడి నుంచి వచ్చింది? ఏమవుతుంది? ఇవన్నీ తెలుసుకోవాలనిపిస్తుంది.

ఈ ఆత్మకు సంబంధించిన జ్ఞానం తెలుసుకోవాలంటే ఒక సద్గురువును ఆశ్రయించాలి, సద్గురువు అపార జ్ఞాన సంపన్నులు కాబట్టి సమస్తం తెలిసి ఉంటుంది, వారు అన్నీ వివరిస్తారు. "ఆత్మ ఎక్కడి నుంచి వచ్చింది?" అనే ప్రశ్న వచ్చినప్పుడు, "పూర్ణాత్మ నుంచి విడిపోయిన అంశే ఆత్మ" అని అర్థమవుతుంది. అంటే ఏ ఆత్మ అయినా ఆ పూర్ణాత్మలో భాగమే అని అర్థమవుతుంది.

ఒక తల్లి నుంచి పిల్లవాడు జన్మించినప్పుడు, ఇద్దరూ ఒకటిగానే

ఉంటారు. అలాగే పూర్ణాత్మ నుంచి విడిపోయిన అంశే మీరు. అంటే అంశాత్మ ఎవరో కాదు, మీరే అన్నది కూడా తర్వాత అర్థమవుతుంది. ఇక్కడ దేహం ఉంది, ఆత్మ ఉంది. దేహం బూడిద అయిపోతుంది కానీ ఆత్మ మాత్రం ఉంటుంది, అంటే ఉండేది ఆత్మే, అంటే మీరు ఆత్మే అని తెలుసుకోవచ్చు. మీరు ఎవరో కాదు పూర్ణాత్మలో భాగం అన్నది గుర్తుపెట్టుకోండి.

మీరు ఈ శరీరాన్ని చూసుకుంటూ దీనికి ఒక పేరు పెట్టుకుని, ఈ శరీరానికి సంబంధించిన భర్త, భార్య, పిల్లలు వీరే నా వాళ్ళు అనుకుంటూ, దేవుడు వేరే అనుకుంటారు. కష్టాలు వచ్చినప్పుడు "దేవుడు నన్నెందుకు సృష్టించాడు? నాకు ఎందుకు ఇన్ని కష్టాలు పెట్టాడు?" అని అనుకుంటారు. కానీ గుర్తుపెట్టుకోండి మీరు శరీరం అయితే, ఆ శరీరాన్ని దేవుడు సృష్టించలేదు, మీ తల్లి సృష్టించింది, కానీ తల్లి సృష్టించిన ఆ శరీరం మీరు కాదు.

పూర్ణాత్మ సృష్టించిన అంశాత్మే మీరు. అంటే ఆయన మిమ్మల్ని వేరుగా సృష్టించలేదు, ఆయన తననే ఎన్నో భాగాలుగా విభజించుకున్నాడు. ఎన్నో అనుభవాలు పొందడానికి, జ్ఞానం పెంచుకోవడానికి, ఇంకా ఎదగడానికి ఈ భాగాలన్నీ ఏర్పడ్డాయి.

కానీ మీరు "నేనే ఈ దేహం" అనుకుంటూ, దేహ సుఖాల కోసం తప్పులు చేస్తూ, పాపాలు చేస్తూ, అధర్మంగా జీవిస్తూ కష్టాలు తెచ్చుకుంటారు. ఆ తర్వాత "దేవుడు నన్ను ఎందుకు కష్టపెడుతున్నాడు?" అంటారు. కానీ మీరు ఎప్పుడైనా "నేను ఆత్మను, ఈ దేహం నేను కాదు" అని ఆలోచించారా?

మీ పిల్లలు కూడా ఆత్మలే, మీ భార్య, భర్త కూడా ఆత్మలే. మీరు వారి శరీరాలను తయారు చేశారు అంతేకానీ వారు మీవారు కాదు. అలాగే మీ తల్లి మీ శరీరాన్ని తయారు చేసింది, కానీ మీరు ఆ శరీరం కాదు.

అందుకే మిమ్మల్ని దేవుడు కష్టపెట్టడం లేదు. మీరు చేసిన కర్మల ఫలితమే మీరు అనుభవిస్తున్నారు. మీరు చేసిన పనుల వల్లే కష్టాలు వస్తున్నాయి.

అందుకే పత్రి గారు "ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు" అంటారు.

మీరు ఈ శరీరానికే ప్రాముఖ్యం ఇస్తూ, దానికోసం తప్పులు చేస్తూ, కష్టాలు తెచ్చుకుని, తర్వాత దేవుడినే నిందిస్తారు. కానీ మీరు అసలు శరీరం కాదు. కొన్ని అనుభవాల కోసం దేహాన్ని తీసుకున్న ఆత్మ మాత్రమే. శరీరం ఉన్నంతకాలం అనుభవాలు పొందుతారు, జ్ఞానం సంపాదించుకుంటారు, తర్వాత శరీరాన్ని వదిలేస్తారు, అంతే.

మరణానంతర జీవితం గురించి అవగాహన ఉన్నప్పుడు మొదట తెలిసేది "నేను దేహం కాదు, ఆత్మను" అన్న సత్యం. శరీరంతో ఉన్న సంబంధం ముగిసినప్పుడు, ఆత్మ బయటికి వస్తుంది. గాలిలో తేలుతూ పై నుంచి తన శరీరాన్ని చూసి ఆశ్చర్యపడుతుంది. "ఇంతకాలం 'నేను' 'నేను' అని అనుకున్న ఈ శరీరం నేనా? లేక ఇప్పుడు గాలిలో వున్న ఈ 'ఆత్మ' నేనా?" అనే సందేహం వస్తుంది. తర్వాత అర్థమవుతుంది క్రింద ఉన్న శరీరం నేను కాదు, గాలిలో ఉన్న 'ఆత్మే' నిజమైన "నేను" అని.

కానీ భూమిపై ఉన్నప్పుడే ఈ జ్ఞానం తెలిసినవారికి అంత గందరగోళం ఉండదు. ఎందుకంటే వారికి ముందే తెలుసు "నేను ఆత్మను" అని. కానీ ఈ జ్ఞానం లేని వారు మరణించిన తర్వాత కూడా ఇల్లు, కుటుంబం, సంపదల మీద మమకారం వదలలేరు.

అందుకే సద్గురువు ద్వారా జీవించి ఉన్నప్పుడే "నేను ఆత్మను" అని తెలుసుకోవాలి. అప్పుడు ఆత్మకు లాభం కలిగించే పనులు చేస్తారు. మరణించిన తర్వాత తెలుసుకుంటే బాధపడతారు, "ఇది ముందే తెలిసి ఉంటే ఎంత బాగుండేది!" అని.

ఎవరైతే "నేను దేహం కాదు, ఆత్మను" అని తెలుసుకుంటారో! వారు దేహానికి కాకుండా 'ఆత్మ'కు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. ఒక రమణ మహర్షి లాగా, ఒక స్వామి వివేకానంద లాగా, ఒక సుభాష్ పత్రి గారి లాగా

జ్ఞానులు ఆత్మకే అత్యున్నత ప్రాధాన్యం ఇస్తారు. అందుకే వారు తమ జీవితంలో నిజమైన లాభాన్ని పొందారు.

అందుచేత ఈ విషయం తప్పకుండా తెలుసుకోవాలి. మరణానంతర జీవితం మీద ఎంత అవగాహన ఉంటే, మీరు మీ లక్ష్యానికి అంత దగ్గరైనట్టే. ఎందుకంటే ఆ అవగాహన కలిగినప్పుడు "నేను ఆత్మను" అన్న సత్యం అర్థమవుతుంది. అప్పుడు ఆత్మ యొక్క అసలు లక్ష్యం ఏమిటో తెలుసుకుని, దానికి అనుగుణంగా జీవించడం ప్రారంభిస్తారు.

ఎప్పుడైతే ఆత్మ లక్ష్యానికి అనుగుణమైన పనులు చేస్తూ ఉంటారో, అప్పుడు మీరు ఖచ్చితంగా మీ లక్ష్యాన్ని చాలా త్వరగా సాధిస్తారు. రమణ మహర్షి గారికి ఈ సత్యం అర్థమైంది కాబట్టే ఆయన తన శరీరాన్ని ఆత్మ సాధన కోసం ఉపయోగించుకున్నారు. అపారమైన సాధన చేసి గొప్ప జ్ఞానాన్ని సంపాదించారు, పత్రి గారు కూడా అలాగే చేశారు.

ఆత్మకు ప్రాముఖ్యం ఇవ్వండి, దేహానికి అసలు ప్రాముఖ్యం ఇవ్వొద్దని నేను అనడం లేదు. ఎందుకంటే ఆత్మకు లాభం కలిగించే పనులన్నీ కూడా ఈ దేహంతోనే చేయాలి. అందుకే పత్రి గారు మీకు ఉన్న వనరులు ఏవైనా సరే సమయం అయినా, ధనం అయినా, శక్తి అయినా 50% శరీరానికి ఉపయోగించండి, మిగిలిన 50% ఆత్మాభివృద్ధికి, ఆత్మకు లాభం కలిగించే పనులకు వినియోగించండి అన్నారు.

# ‘ఆత్మ’ లక్ష్యమే మీ అసలు లక్ష్యం

**“మరణానంతర జీవితం మీద మీకు ఎంత అవగాహన ఉంటే, మీరు మీ లక్ష్యానికి అంత దగ్గరైనట్టే”.**

“మీరు మీ లక్ష్యానికి అంత దగ్గరైనట్టు” అని అంటున్నాను అంటే గుర్తుపెట్టుకోండి ఇందులో చాలా అంతరార్థం ఉంది. ఎప్పుడూ కూడా బాహ్యంగా కనిపించే భౌతికమైనవి నిజం కావు, బయటికి కనిపించే ఈ శరీరం మీరు కాదు, ఈ శరీరంలో కనిపించనటువంటి ఆత్మ ఉంటుంది, అదే మీరు.

ఎంతసేపు మీరు బయటికి కనిపించే ఈ శరీరం గురించే, దానికి సంబంధించిన విషయాల గురించే ఆలోచిస్తూ ఉంటారు. అలాగే శారీరక పరంగా మీకు కొన్ని లక్ష్యాలు ఉంటాయి. ఆ లక్ష్యాలను సాధించడానికి మీరు మీ జీవితమంతా వెచ్చిస్తారు.

ఒక చిన్న ఉదాహరణ చూద్దాం. మీకు సొంత ఇల్లు లేదు, కానీ మీ చుట్టుపక్కల ఉన్నవారికి, మీ బంధువులకు, కుటుంబ సభ్యులకు సొంత ఇళ్ళు ఉన్నాయి. అప్పుడు “అందరికీ ఇల్లు ఉంది, నాకే లేదు” అనే ఆలోచన మీలో పదే పదే వస్తూ ఉంటుంది. అలా ఆలోచిస్తూ ఆలోచిస్తూ చివరికి అదే మీ జీవిత లక్ష్యంగా మారిపోతుంది.

“ఎలాగైనా జీవితంలో ఒక సొంత ఇల్లు కట్టుకోవాలి” అని మీరు నిర్ణయించుకుంటారు. ఆ ఇల్లు కట్టే స్థోమత మీకు లేకపోయినా, లోన్లు తీసుకొని, ఎన్నో కష్టాలు పడి దాన్ని నిర్మిస్తారు. ఇల్లు కట్టుకున్న తర్వాత లక్ష్యాన్ని సాధించామని అనుకుంటారు. కానీ జీవితమంతా ఆ లోన్లు తీర్చడానికే సరిపోతుంది. కొన్నిసార్లు అవి పూర్తిగా తీరకపోయినా, మీరు శరీరం వదిలేయచ్చు కూడా. అంటే మీ జీవిత లక్ష్యం అదే అయిపోయింది, దానికోసమే మీ జీవితమంతా వెచ్చిస్తారు.

కానీ ఇప్పుడు మీరు ఒక విషయం తెలుసుకున్నారు "నేను దేహం కాదు, నేను ఆత్మ" అని. మరి ఆత్మే మీరు అయినప్పుడు, ఇప్పటి వరకు మీరు దేహమే నేను అని భావించి దానికి సంబంధించిన లక్ష్యాలను మాత్రమే నిర్ణయించుకున్నారు. ఇప్పుడు మీరు ఆలోచించాల్సింది ఏమిటంటే, ఆత్మగా మీ అసలు లక్ష్యం ఏమిటి అనేదే.

ఒకరికి క్రికెట్ ఆట మీద చాలా ఆసక్తి ఉంటుంది. ఆయన సునీల్ గవాస్కర్ లాగానో, సచిన్ టెండూల్కర్‌లాగానో గొప్ప క్రికెటర్ కావాలని అనుకుంటాడు. ఇంకొకరికి రాజకీయాల మీద ఆసక్తి ఉంటుంది, కనీసం కౌన్సిలర్ అయినా కావాలని అనుకుంటాడు, మంత్రి లేదా ముఖ్యమంత్రి కావాలనే ఆశ లేకపోయినా, ఆ స్థాయికి చేరుకోవడమే అతని లక్ష్యంగా ఉంటుంది.

మరి కొందరికి సినిమాల మీద ఆసక్తి ఉంటుంది, వారు గొప్ప హీరోలు కావాలని కోరుకుంటారు. ఇంకొందరు గొప్ప హీరోయిన్‌లు కావాలని ఆశపడతారు, అదే వారి జీవిత లక్ష్యంగా మారిపోతుంది. ఆ లక్ష్యాన్ని సాధించడానికే వారు తమ జీవితమంతా వెచ్చిస్తారు.

కానీ మీరు ఆత్మ అయితే, మీ అసలు లక్ష్యం పూర్ణాత్మ కావడం.

"నేను ఆత్మ" అనే అవగాహన మీకు కలిగితే, మీ లక్ష్యం మారిపోతుంది. అప్పుడు మీరు మీ జీవితాన్ని ఆ లక్ష్య సాధనకే వినియోగిస్తారు. అంతకుముందు మాత్రం మీరు దేహ లక్ష్యాలకే మీ జీవితాన్ని అంకితం చేసారు.

గుర్తుపెట్టుకోండి దేహ లక్ష్యం వేరు, మీ లక్ష్యం వేరు. మీరు అంటే 'ఆత్మ'. దేహం మీరు కాదు, కాబట్టి మీ లక్ష్యం అంటే ఆత్మ లక్ష్యమే. దేహ లక్ష్యాలను మీ అసలు లక్ష్యంగా భావించకండి, మీ జీవితాన్ని వృథా చేసుకోకండి, మీ ధనాన్ని వృథా చేసుకోకండి, మీ సమయాన్ని వృథా చేసుకోకండి, మీ వాక్కును వృథా చేసుకోకండి, మీ శక్తిని, మీ ఆయుష్షును వృథా చేసుకోకండి.

**"దేహ లక్ష్యం మీ లక్ష్యం కాదు. 'ఆత్మ' లక్ష్యమే మీ అసలు లక్ష్యం".** దానిని సాధించడానికి ప్రయత్నించండి. **"ఆత్మ లక్ష్యం ఏమిటి అంటే పూర్ణ జ్ఞానాన్ని సంపాదించి పూర్ణాత్మ స్థితిని చేరుకోవడం".** మీరు పూర్ణాత్మ నుండి విడిపోయి వచ్చినప్పుడు, ఆ పూర్ణాత్మ మీకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించింది. అది ఏమిటంటే **"నువ్వు కూడా నా స్థాయికి చేరుకోవాలి, పూర్ణ జ్ఞాని కావాలి, నేను ఉండే సత్యలోకాన్ని నువ్వు మళ్ళీ చేరుకోవాలి."**

అప్పటి వరకు నువ్వు జన్మలు తీసుకుంటూ జనన–మరణ చక్రంలో తిరుగుతూనే ఉంటావు. అయితే పూర్ణాత్మ కేవలం లక్ష్యాన్ని నిర్దేశించి ఊరుకోదు. మీరు ఆ లక్ష్యాన్ని చేరుకునే వరకు ప్రతి క్షణం మీకు సహకరిస్తూనే ఉంటుంది. "పూర్ణాత్మ మాకు ఎలా సహకరిస్తుంది?" అని మీరు అనుకోవచ్చు. పూర్ణాత్మ స్వయంగా వచ్చి మీ చేతిలో ఏదీ పెట్టదు. కానీ తనలోని అంశయైన మీ శరీరంలోని ఆత్మ ద్వారా అనేక విధాలుగా మీ లక్ష్య సాధనలో సహకరిస్తూనే ఉంటుంది.

అయితే ఈ విషయం మీకు అర్థం కాదు, ఎందుకంటే మీరు అంతరంలో ఉన్న ఆత్మనే నేను అనే అవగాహన లేకుండా, ఈ దేహమే నేను అని భావిస్తూ దేహ సంబంధమైన సంసారం, బాధ్యతలు, బంధాలలో మునిగిపోతున్నారు. దాంతో అంతరంలో ఉన్న పూర్ణాత్మ మీకు ఇచ్చే సూచనలు అర్థం కావు. వాటిని మీరు నిర్లక్ష్యం చేస్తారు, అలా జన్మ జన్మలుగా నిర్లక్ష్యం చేస్తూ వస్తే, జన్మలు పెరుగుతాయి.

అదే 'అంతరాత్మ' చెప్పే మార్గాన్ని మీరు అనుసరిస్తే, మీ లక్ష్యానికి మీరు క్రమంగా దగ్గరవుతారు. **"లక్ష్యానికి దగ్గరవడం అంటే జన్మలు తగ్గించుకోవటం, పూర్ణాత్మ స్థితికి చేరువ కావడం".** మీరు ఏ విషయాల మీద దృష్టి పెడుతున్నారో, వాటి కోసం మీ సమయం, ధనం, శక్తి, సామర్థ్యాలను వెచ్చిస్తున్నారో! అవన్నీ కూడా శరీరం ఉన్నంత వరకే, శరీరాన్ని విడిచిన తర్వాత

వాటిలో ఒక్కటి కూడా మీకు ఉపయోగపడదు.

కానీ అంతరాత్మ చెప్పిన విధంగా, పూర్ణాత్మ నిర్దేశించిన మార్గంలో మీరు చేసే సాధన, సంపాదించిన జ్ఞానం మాత్రమే మీకు నిజంగా ఉపయోగపడతాయి, అవే మీతో పాటు వస్తాయి. మీ లక్ష్యానికి మిమ్మల్ని దగ్గర చేసేది అదే, ఇది ఎప్పటికీ మర్చిపోకండి. “మీరు మీ లక్ష్యానికి దగ్గరైనట్టు” అనే మాటలో ఎంత లోతైన అర్థం ఉందో ఒకసారి ఆలోచించండి.

ముందుగా మీరు ఎవరో తెలుసుకుంటే, మీ లక్ష్యం ఏమిటో కూడా మీకు తెలుస్తుంది. మీరు “దేహమే నేను అని భావిస్తే”, మీ అసలు లక్ష్యం ఏమిటో మీకు ఎప్పటికీ తెలియదు, అప్పుడు ఈ జన్మ మొత్తం వృథా అయినట్టే. బాగా సంపాదించాలి, సుఖంగా జీవించాలి, మంచి ఇల్లు కట్టుకోవాలి, అన్ని సౌకర్యాలు సమకూర్చుకోవాలి, జీవితం హాయిగా గడిచిపోతే చాలు ఇదే మీ లక్ష్యంగా మారుతుంది. కానీ ఈ దేహ సుఖాలకు ప్రాముఖ్యం ఇచ్చేది ఎవరు? మనమా? ఆత్మా?

నా విషయానికి వస్తే, ఆ పూర్ణాత్మ నాకు “ఖాళీగా కూర్చోకు, ఈ వేసవి నెల రోజులు శ్రద్ధగా తిరుగు, అనుభవాలు సంపాదించుకో” అని నిర్దేశించినట్లుగా నాకు అనిపించింది. నేను దేహమే అని అనుకుంటే, వేసవి కాలంలో ఎండలో తిరగడం కష్టంగా, ఇబ్బందిగా అనిపిస్తుంది.

కానీ నేను ఆత్మను అని భావిస్తే, అదే పని నాకు అవసరమైనదిగా కనిపిస్తుంది. ఇక్కడే దేహ దృష్టికి, ఆత్మ దృష్టికి మధ్య ఉన్న తేడా తెలుస్తుంది. నేను దేహం అని భావిస్తే, ఈ తిరగడం వ్యర్థమైన పనిగా అనిపిస్తుంది. కానీ నేను ఆత్మ అని భావిస్తే, ఈ తిరగడం నాకు లాభం చేకూర్చే పని, ఎన్నో అనుభవాలను సంపాదించి పెట్టే పనిగా కనిపిస్తుంది. అందువల్ల ఒకే పని దేహాభిమానంతో చూస్తే భారంగా అనిపిస్తుంది, ఆత్మాభిమానంతో చూస్తే అది అనుభవ సంపాదనకు, లక్ష్య సాధనకు ఉపయోగపడే అవకాశంగా మారుతుంది.

అందుకే మీరు మీ లక్ష్యానికి దగ్గర అవ్వడానికి నిరంతరం ప్రయత్నించాలి. మీ అసలు లక్ష్యం పూర్ణాత్మ స్థితికి చేరుకోవడం, ధనాన్ని సంపాదించడం కాదు. మీరు కోట్ల రూపాయలు సంపాదించి ఉండవచ్చు, ఎంతో కష్టపడి ఇతరుల కంటే గొప్ప స్థాయికి ఎదిగి ఉండవచ్చు, అద్భుతమైన భవనాలు నిర్మించి ఉండవచ్చు, మీ ఇంటిని చూసి ఎంతో మంది ఆశ్చర్యపోయి ఉండవచ్చు, వాటిని చూసి మీరు గర్వపడి ఉండవచ్చు.

కానీ చివరికి శరీరాన్ని విడిచిపెట్టిన తర్వాత అవన్నీ ఇక్కడే ఉండిపోతాయి. అప్పుడు జీవితాంతం గొప్పవి అనుకున్నవన్నీ శాశ్వతమైనవి కావని గ్రహిస్తారు. అదే సమయంలో మీరు జ్ఞానాన్ని సంపాదించి ఉంటే, ఆ జ్ఞాన సంపాదన కోసం మీ ధనం, సమయం, వాక్కు, శక్తి, వనరులను వినియోగించి ఉంటే, మీ ఆత్మ మరింత ఉన్నత స్థితులకు ఎదగగలుగుతుంది.

మీరు ఎంత ఉన్నత స్థితికి చేరుకుంటే, మీ లక్ష్యానికి అంత దగ్గరవుతారు. ఉన్నత లోకాలను చేరుకున్న ఆత్మ, భౌతికంగా గొప్ప స్థాయిలో ఉన్నవారి కంటే కూడా ఆధ్యాత్మికంగా ఉన్నతమైన స్థితిలో ఉంటుంది. జనాలోకాన్ని దాటి మహాలోకాన్ని చేరుకున్నవారు, అంతకుముందు తక్కువ స్థాయిలో ఉన్న వారికంటే ఆధ్యాత్మికంగా ఉన్నతమైన స్థితిని పొందిన వారిగా భావించబడతారు.

మహాలోకాన్ని చేరుకున్నవారు గత జన్మలో ఒక ఆటో డ్రైవర్ అయి ఉండవచ్చు, ఒక సాధారణ ఉద్యోగి అయి ఉండవచ్చు, లేదా ఒక సామాన్య కుటుంబంలో జీవించిన వ్యక్తి అయి ఉండవచ్చు. కానీ అతను లేదా ఆమె జ్ఞానం మీద దృష్టి పెట్టి, ఆధ్యాత్మిక వికాసం కోసం కృషి చేసి, జ్ఞానాన్ని సంపాదించుకుని మహాలోకం చేరుకున్నారు.

అలాంటి ఉన్నత స్థితిని చేరుకున్నప్పుడు వారికి ఒక గొప్ప సత్యం అర్థమవుతుంది. ఒకప్పుడు తాను ఇతరులను చూసి, వారి సంపదను చూసి,

వారి స్థాయిని చూసి గొప్పవారిగా భావించానని గుర్తుకు వస్తుంది. కానీ వారు సంపాదించిన ఆస్తులు, హోదాలు, భౌతిక విజయాలన్నీ అక్కడే వదిలి వచ్చారని కూడా అర్థమవుతుంది.

అప్పుడు వారు గ్రహిస్తారు "ఒకప్పుడు నా దగ్గర ఏమీ లేవని బాధపడ్డాను. కానీ ఇప్పుడు నేను ఎంత ఉన్నత స్థితికి ఎదిగాను! భౌతికంగా గొప్పవాడిని కాకపోయినా, ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నత స్థాయికి చేరుకున్నాను" అని.

నా విషయానికి వస్తే, నేను ఎప్పుడు ఒక విషయం ఆలోచించే వాడిని ఏమిటంటే ఈ ప్రపంచంలో అనేక ఆధ్యాత్మిక సంస్థలు ఉన్నాయి. వాటిలో చాలా సంస్థలకు లక్షాధికారులు, కోటీశ్వరులు సభ్యులుగా ఉంటారు. అందువల్ల వారికి ఆర్థిక వనరులు సమృద్ధిగా ఉండటం వల్ల వారు పెద్ద పెద్ద కార్యక్రమాలు, నిర్మాణాలు, ప్రాజెక్టులు నిర్వహించగలుగుతున్నారు.

కానీ ఎన్ని సంవత్సరాలు గడిచినా కడ్తాల్‌లో కనీసం ధ్యానం చేసుకోవడానికి ఒక హాలు కూడా ఇంకా నిర్మించలేదు. ఎందుకు? అని ఆలోచించినప్పుడు నాకు ఒక విషయం అర్థమైంది. మన సంస్థలో ఎక్కువగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే ఉన్నారు కాబట్టి అని అర్థమయింది. అప్పుడు నాకు మరో ఆలోచన వచ్చింది. గొప్ప గొప్ప ధనవంతులు, ఉన్నత స్థాయిలో ఉన్నవారు ఈ మార్గంలో ఎందుకు ఎక్కువగా కనిపించడం లేదు? వారు ఎందుకు ఇందులోకి రావడం లేదు? అని.

ఈ విషయం ఆలోచించినప్పుడు జీసస్ చెప్పిన ఒక మాట గుర్తుకు వచ్చింది. ఆయన, "ఒంటెను సూది బెజ్జంలో దూర్చగలమేమో కానీ, ధనవంతుడు దేవుని రాజ్యంలో ప్రవేశించలేడు" అని చెప్పారు.

ఈ మాటకు అర్థం ఏమిటంటే? ధనవంతుడు ఎంతసేపూ ధనం, ఆస్తులు, భౌతిక సౌకర్యాలపైనే మమకారం ఎక్కువగా వుండటం వల్ల, ఆధ్యాత్మిక

లక్ష్యంపై దృష్టి పెట్టడం కష్టమవుతుంది. మోక్షం అంటే మీ అసలు లక్ష్యాన్ని చేరుకోవడం. కానీ ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి కావలసింది ధనం కాదు, జ్ఞానం.

ఆ జ్ఞానాన్ని సామాన్యులు కూడా సంపాదించగలరు. కానీ చాలా మంది ధనవంతులకు జ్ఞానం మీద దృష్టి పెట్టరు. వారి సమయం, శక్తి, ఆలోచనలు ఎక్కువగా సంపదను కాపాడుకోవడం, పెంచుకోవడం వంటి విషయాలపైనే ఉంటాయి.

కావాలంటే మీరు ధనం ఉన్నవారి దగ్గరకు వెళ్ళి చెప్పండి "జ్ఞానం చాలా గొప్పది, జ్ఞానం సంపాదించుకోండి. ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు, ధనం, ఆస్తులు, హోదాలు మీతో రావు" అని. కానీ ఆ మాటలను అందరూ సులభంగా అంగీకరించలేరు. ఎందుకంటే మనిషి ఎక్కువగా తన కళ్ళకు కనిపించే వాటినే నిజమని నమ్ముతాడు.

అయితే ఈ ప్రపంచంలో భౌతికంగా సంపాదించిన ఏదీ శాశ్వతం కాదు. శరీరం కూడా శాశ్వతం కాదు. మీతో పాటు వచ్చేది, మీకు నిజంగా ఉపయోగపడేది, మీరు సంపాదించిన జ్ఞానం మాత్రమే. అందుకే జ్ఞానాన్ని సంపాదించడం, ఆత్మ లక్ష్యాన్ని గుర్తించడం, ఆ లక్ష్యం వైపు ప్రయాణించడం జీవితంలో అత్యంత ముఖ్యమైన విషయం.

జ్ఞానాన్ని సంపాదించడానికి సిద్ధంగా ఉన్నవారే నిజంగా తమ లక్ష్యానికి దగ్గరవుతారు. ఎందుకంటే శాశ్వతంగా మీతో ఉండేది సంపద కాదు; మీరు సంపాదించిన జ్ఞానం. అందుకే ఈ జ్ఞాన మార్గంలో ఎక్కువ మంది ఉండరు. ఈ జ్ఞానం బోధించే దగ్గరకు కూడా అందరూ రాలేరు. జ్ఞానం గురించి విన్నా కూడా, ఈ మార్గంలో నిలకడగా కొనసాగడం అందరి వల్ల కాదు. చాలా కొద్దిమంది మాత్రమే ఈ మార్గాన్ని ఎంచుకుంటారు.

అలాంటి కొద్దిమందిలో మీరు కూడా ఒకరు. ఇది అందరి వల్ల

అయ్యే విషయం కాదు, ప్రతి ఒక్కరూ ఈ జ్ఞానం, ధ్యానం పట్ల ఆకర్షితులు కాలేరు. అందుకే ధ్యానం మీద, జ్ఞానం మీద మీకు ఆసక్తి ఉంది. అందుకే మీరు ఈ మార్గంలో కొనసాగగలుగుతున్నారు, కార్యక్రమాల్లో పాల్గొనగలుగుతున్నారు.

మీరు చేస్తున్న పని ఎంత గొప్పదో, దాని నిజమైన విలువ ఏమిటో, శరీరాన్ని విడిచిన తర్వాత పూర్తిగా అర్థమవుతుంది. ప్రస్తుతం మీరు చేస్తున్న ఆధ్యాత్మిక సాధన వల్ల మీ లక్ష్యానికి ఎంత దగ్గరయ్యారో అప్పుడు స్పష్టంగా తెలుస్తుంది.

మరో విషయం కూడా గుర్తుంచుకోండి. మరణానంతర జీవితం గురించి మీకు ఉన్న అవగాహన చాలా మందికి ఉండదు. చాలామందికి మరణం తర్వాత కూడా జీవితం కొనసాగుతుందనే ఆలోచన కూడా ఉండరు. కానీ ఆ విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి, వాటిని అర్థం చేసుకునే సామర్థ్యం మీలో ఉంది, అందుకే మిమ్మల్ని సామాన్యులు కాదని అంటాను.

కాబట్టి ఒక విషయం ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి **"మరణానంతర జీవితం గురించి మీకు ఎంత అవగాహన ఉంటే, మీరు మీ లక్ష్యానికి అంత దగ్గరైనట్టే."** ఈ వాక్యాన్ని కేవలం చదివి ప్రక్కన పెట్టకండి. "మీరు", "మీ లక్ష్యం", "దగ్గర అవడం" అనే పదాలలోని లోతైన అర్థాన్ని ఆలోచించండి. మీరు ఎవరు? మీ అసలు లక్ష్యం ఏమిటి? ఆ లక్ష్యానికి మీరు ఎంత దగ్గరయ్యారు? అనే ప్రశ్నలను మీరు పరిశీలించుకోండి. ఈ ఒక్క వాక్యంలోని లోతైన అర్థాన్ని గ్రహించగలిగితే, అది మీ జీవితాన్నే మార్చగలదు.

# మరణానంతర జీవితం

మరణానంతర జీవితం గురించి మీకు ఎంత అవగాహన ఉంటే, మీరు మీ జీవిత లక్ష్యానికి అంత దగ్గరవుతారు.

ఈరోజు మరణానంతర జీవితం గురించి అవగాహన కలిగి ఉండటం అంటే ఏమిటి? ఏ విషయాలపై అవగాహన పెంచుకోవాలి? అలాంటి అవగాహన వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి? అనే విషయాలను తెలుసుకుందాం.

ఎందుకంటే మరణానంతర జీవితం గురించి ఎక్కువ అవగాహన ఆత్మజ్ఞానం కలిగిన వారికి,ఆత్మజ్ఞానాన్ని పెంచుకున్న వారికి, అజ్ఞానాన్ని తొలగించుకున్న వారికి ఉంటుంది. అలాంటి వారు ఎన్నో విషయాలను తెలుసుకుంటారు. మరణించిన తర్వాత కూడా జీవితం కొనసాగుతుందని తెలుసుకుంటారు, చనిపోవడం అంటే జీవితం ముగిసిపోవడం కాదని అర్థం చేసుకుంటారు. ఈ జీవితంలో ఎన్నో విషయాలు నేర్చుకోవడానికి మీకు అవకాశం ఇవ్వబడింది. ఆయుష్షు పూర్తయినప్పుడు మీరు శరీరాన్ని వదిలివేస్తారు. అంటే ప్రకృతి మీకు నేర్చుకోవడానికి కొన్ని సంవత్సరాల జీవితాన్ని ప్రసాదించింది.

అందుకే ఆత్మ ఒక తల్లి గర్భంలో తయారవుతున్న శరీరంలో ప్రవేశించి, స్త్రీగా గానీ పురుషుడిగా గానీ జన్మ తీసుకొని ఈ భూమి పైకి వస్తుంది. భూమిపై ఎదుగుతూ ఎన్నో బాధ్యతలను నిర్వహిస్తూ, అవసరాలను తీర్చుకుంటూ జీవిస్తుంది. శరీరాన్ని తీసుకున్న తర్వాత శరీరానికి కొన్ని సహజమైన అవసరాలు ఉంటాయి. వాటిని కూడా తీర్చుకోవాల్సి ఉంటుంది. అన్నింటికంటే ముఖ్యమైన అవసరాలు రెండు. ఒకటి జటరాగ్నిని చల్లార్చడం, అంటే ఆకలిని తీర్చుకోవడం. రెండోది యుక్త వయస్సు వచ్చిన తర్వాత

కామాగ్నిని చల్లార్చడం. ఇవి రెండు శరీరానికి సహజమైన అవసరాలు.

ఇవే కాకుండా నివసించడానికి ఒక గూడు, ధరించడానికి వస్త్రం కూడా అవసరమే. ఈ అవసరాలన్నింటినీ తీర్చుకోవాలి, అయితే ఇవన్నీ నెరవేర్చుకోవాలంటే ప్రతి ఒక్కరికీ ఒక తోడు అవసరం అవుతుంది. ఎందుకంటే అన్ని పనులు ఒక్కడే చేయలేడు. అందుకే పురుషుడు స్త్రీ తోడు సంపాదించు కుంటాడు, స్త్రీ పురుషుని తోడు సంపాదించుకుంటుంది. ఇలా ఒకరికొకరు తోడుగా ఉండటం వల్ల జీవితం సులభమవుతుంది. ఎందుకంటే ఒక వ్యక్తి అన్ని బాధ్యతలు ఒంటరిగా నిర్వహించడం సాధ్యం కాదు. అందుకే పరస్పర సహకారంతో జీవిత ప్రయాణాన్ని కొనసాగిస్తారు.

కాబట్టి స్త్రీ ఇంటి పనులను చూసుకుంటే, పురుషుడు సంపాదన బాధ్యతను తీసుకుంటాడు. అవసరాలు తీరాలంటే డబ్బు అవసరం కాబట్టి ఆ బాధ్యతను పురుషుడు నిర్వర్తిస్తాడు. అయితే అంతటితో సరిపోతుందా అంటే కాదు. ఇంట్లో ఎన్నో అవసరాలు, ఎన్నో పనులు ఉంటాయి. బయట పురుషుడు ఎంత కష్టపడతాడో, ఇంట్లో స్త్రీ కూడా అంతే కష్టపడుతుంది. ఇలా ఇద్దరి శ్రమ వల్ల కుటుంబ అవసరాలు నెరవేరతాయి.

కానీ ఇక్కడ ఒక విచిత్రమైన విషయం ఉంది. మానవునికి ఐదు జ్ఞానేంద్రియాలు ఇవ్వబడ్డాయి. అలాగే వాటితో పాటు అంతరేంద్రియమైన మనసు కూడా ఇవ్వబడింది. ప్రతి ఇంద్రియం తనకు సంబంధించిన విషయాల వైపు ఆకర్షిస్తూ ఉంటుంది. ఈ ప్రకృతిలో కూడా ఇంద్రియాలకు కావలసిన వనరులన్నీ సమృద్ధిగా సృష్టించబడ్డాయి. కళ్ళకు తృప్తినిచ్చే సుందర దృశ్యాలు, చెవులకు ఆనందాన్ని ఇచ్చే మధుర స్వరాలు, రకరకాల భాషలు, నాలుకకు తృప్తినిచ్చే రుచులు, శరీరానికి సుఖానుభూతిని కలిగించే స్పర్శలు ఇలా అనేక విషయాలు ఉన్నాయి.

ఇవి ఎంత ఆకర్షణీయంగా ఉంటాయంటే, ఒకసారి అనుభవించడం

ప్రారంభిస్తే మరింతగా అనుభవించాలని అనిపిస్తుంది. ఇంద్రియాలకు బానిసలైన వారు వాటి అనుభవాలనే కోరుకుంటూ ఉంటారు. అలాగే అంతరేంద్రియమైన మనసు కూడా ఉంది. దాని పని నిరంతరం కోరికలను కోరడం. అది రకరకాల కోరికలను కోరుతూనే ఉంటుంది. అప్పుడు మనిషి ఇంద్రియాలను తృప్తి పరచడానికి, మనసు కోరిన కోరికలను నెరవేర్చడానికి ప్రయత్నిస్తూ వాటిలో మునిగిపోతాడు.

కానీ ఇవన్నీ తీర్చడం అంత సులభం కాదు. మనసులో ఉన్న అనేక కోరికలు నెరవేరాలంటే, ఉన్న వనరులు చాలవు, ఆర్థిక స్థితి కూడా చాలదు. అందువల్ల కొందరు తప్పులు చేస్తారు, అధర్మ మార్గాలను ఆశ్రయిస్తారు, తగని పనులు చేస్తారు. ఇంద్రియాలను, మనసును తృప్తి పరచడానికి ప్రయత్నిస్తారు, ఉన్నదానితో సంతృప్తి చెందరు. ఎప్పుడైతే పాప కార్యాలు చేస్తారో, వాటి ఫలితంగా కష్టాలు, సమస్యలు, రోగాలు వస్తాయి. వాటిని భరించలేక వాటి నుండి బయటపడటానికి మళ్లీ ప్రయత్నాలు చేస్తారు. ఈ విధంగా జీవితమంతా ఇంద్రియాలను, మనసును తృప్తి పరచడానికి ప్రయత్నించడం, ఆ ప్రయత్నాల వల్ల తప్పులు చేయడం, వాటి ఫలితంగా కష్టాలు అనుభవించడం, మళ్ళీ వాటి నుండి బయటపడటానికి ప్రయత్నించడం ఇలాగే గడిచిపోతుంది. చూస్తుండగానే బాల్యం గడిచిపోతుంది, యవ్వనం గడిచిపోతుంది, మధ్య వయస్సు గడిచిపోయి చివరకు వృద్ధాప్యం కూడా వస్తుంది.

స్త్రీ జీవితమంతా ఇంటిని చూసుకోవడం, వంట చేయడం, అందరికీ భోజనం పెట్టడం, పిల్లలను పెంచడం వంటి పనులతో గడిచిపోతుంది. పురుషుడు సంపాదించడం కోసం శ్రమిస్తాడు. సంపాదన సరిపోకపోతే అబద్ధాలు చెప్పడం, తప్పులు చేయడం, మరింత డబ్బు కోసం ప్రయత్నించడం మొదలవుతుంది. ఇలా జీవితమంతా గడిచిపోయి చివరకు శరీరాన్ని వదిలివేస్తారు. శరీరాన్ని వదిలిన తర్వాత ఒక గొప్ప సత్యం అర్థమవుతుంది.

**“నేను ఈ దేహం కాదు, నేను ఆత్మను”** అనే విషయం అప్పుడు స్పష్టమవుతుంది, అప్పుడు ఆశ్చర్యపోతారు. **“జీవితమంతా ఈ దేహం కోసం ఎన్నో పనులు చేశాను, ఎన్నో సాధించాను, కానీ నేను ఈ దేహం కాదా? నేను నా బంధువులు అనుకున్న వారు నిజంగా నా వారు కారా? ఎవరి కోసం, దేని కోసం జీవితమంతా కష్టపడ్డానో అవేమీ నాతో రావా?”** అనే ప్రశ్నలు కలుగుతాయి.

అప్పుడు శరీరానికి సంబంధించినవన్నీ తాత్కాలికమని, ఆత్మ మాత్రమే శాశ్వతమని గ్రహిస్తాడు. ఇదే మరణించిన తరువాత జీవితం గురించి తెలుసుకునే విషయం. ‘నేను ఆత్మను’ అనే విషయం అప్పుడు అర్థమవుతుంది. మరణించిన తర్వాతే అసలు తాను ఎందుకు భూమిపైకి వచ్చాడో! ఏ పని కోసం వచ్చాడో! జీవితంలో ఏమి చేశాడో తెలుసుకుంటాడు. ఒక పని కోసం భూమిపైకి వచ్చి, ఇంకొక పని చేసి వెళ్లిపోయానా? అని ఆశ్చర్యపడతాడు. ఈ విషయం మరణించిన తర్వాతే స్పష్టంగా తెలుస్తుంది.

పై లోకాలలో ఆత్మగా ఉన్నప్పుడు ఎన్నో నిర్ణయాలు తీసుకొని భూమిపైకి వస్తాడు. కానీ భూమిపైకి వచ్చి శరీరాన్ని స్వీకరించిన తర్వాత తాను ఆత్మ అనే విషయాన్నే మరిచిపోతాడు. జీవితమంతా దేహం కోసమే శ్రమిస్తాడు, దేహం కోసమే అన్ని పనులు చేస్తాడు, చివరకు జీవితం పూర్తవుతుంది, శరీరాన్ని వదిలేస్తాడు. శరీరాన్ని వదిలిన తర్వాత “నేను శరీరం కాదు” అనే సత్యం అర్థమవుతుంది. కానీ ఎవరైతే శరీరం ఉన్నప్పుడే **“నేను ఆత్మను”** అనే విషయాన్ని తెలుసుకుంటారో, వారు నిజంగా అదృష్టవంతులు. ఎందుకంటే ఒక సద్గురువు లభించినప్పుడు తాను శరీరం కాదని, ఆత్మ అని గ్రహిస్తాడు.

అలా తెలుసుకున్న వారే ఈరోజు ఇక్కడ ఉన్నారు. భీమవరానికి వచ్చే వారైనా, ఈ జూమ్‌లో పాల్గొంటున్న వారైనా, ఈ జ్ఞానాన్ని ఏదో ఒక రూపంలో తెలుసుకున్న వారే. ఈ విషయం తెలుసుకున్న తర్వాత వారు తమ

సమయం మొత్తాన్ని కేవలం శరీర అవసరాలకే కాకుండా, ఆత్మ కోసం కూడా కేటాయించడం ప్రారంభిస్తారు. అందువల్ల గురువు ద్వారా ఆత్మకు సంబంధించిన జ్ఞానాన్ని పొందుతూ ఆత్మ గురించి ఎన్నో విషయాలు తెలుసుకుంటారు.

అంతేకాదు, **"ఇదొక్కటే జీవితం కాదని కూడా అర్థం చేసుకుంటారు. శరీరాన్ని వదిలిన తర్వాత కూడా తాము ఉంటామని, అంటే ఆత్మగా తమ జీవితం కొనసాగుతుందని తెలుసుకుంటారు".** సద్గురువును ఆశ్రయించిన వారికి ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. సద్గురువు లభించకపోతే ఈ సత్యాన్ని తెలుసుకోవడం చాలా కష్టం. మరణానంతరం కూడా జీవితం ఉంటుందని తెలుసుకున్న తర్వాత, ఆ జీవితంపై కూడా అవగాహన పెంచుకుంటారు. మరణించిన తర్వాత ఏమి జరుగుతుంది? ఏ లోకాలకు వెళ్తారు? అక్కడ ఎంతకాలం ఉంటారు? ఏమి నేర్చుకుంటారు? ఎలాంటి అనుభవాలు పొందుతారు? మళ్ళీ భూమిపైకి ఎప్పుడు వస్తారు? ఎలా వస్తారు? వంటి అనేక విషయాలను తెలుసుకుంటారు.

భూమిపై ఉన్న చాలా మందికి తెలియని ఈ విషయాలు సద్గురువు లభించిన తర్వాత అర్థమవుతాయి. అప్పుడు వారికి ఇంకో గొప్ప సత్యం తెలుస్తుంది. శరీరంతో కూడిన జీవితం తాత్కాలికం, శరీరం లేకుండా ఆత్మతో ఉండే జీవితం శాశ్వతం అని. అందువల్ల ప్రాధాన్యం ఇవ్వాల్సింది కేవలం శరీరానికే కాదు, శాశ్వతమైన ఆత్మకు అని అర్థమవుతుంది. అంతకుముందు వారు ధనానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చేవారు, ధన సంపాదననే ప్రధాన లక్ష్యంగా భావించేవారు. కానీ మరణానంతర జీవితం గురించి అవగాహన కలిగిన తర్వాత ధనం ఒక్కటే సరిపోదని తెలుసుకుంటారు, మరణానంతర జీవితానికి ఉపయోగపడేది జ్ఞానం అని గ్రహిస్తారు.

అందువల్ల ధన సంపాదనతో పాటు, జ్ఞాన సంపాదన కూడా ప్రారంభిస్తారు. జ్ఞాన పరిధి పెరిగే కొద్దీ మెల్లగా దేహ అవసరాలకు మాత్రమే

పరిమితమవుతారు. అవసరాలకు పరిమితమైనప్పుడు వారికి ఎక్కువ సమయం మిగులుతుంది. ఆ సమయాన్ని జ్ఞాన సంపాదనకు వినియోగిస్తారు. మరణానంతర జీవితం గురించి అవగాహన పెరిగే కొద్దీ ధనం యొక్క ప్రాముఖ్యం పరిమితమని, జ్ఞానం యొక్క ప్రాముఖ్యం అపారమని అర్థమవుతుంది. అప్పుడు జ్ఞానాన్ని సంపాదించుకోవడానికి మరింత కృషి చేస్తారు.

వారికి ఇంకో అవగాహన కూడా కలుగుతుంది, ధనం సంపాదించాలన్నా, జ్ఞానం సంపాదించాలన్నా శరీరం అవసరమని, అందుకే శరీరాన్ని నిర్లక్ష్యం చేయరు, శరీరాన్ని కేవలం భోగాల కోసం కాకుండా, జ్ఞాన సంపాదనకు ఉపయోగపడే సాధనంగా భావిస్తారు. అవసరాలు తీరుతున్నప్పుడు అధర్మంగా సంపాదించాల్సిన అవసరం ఉండదు, తప్పులు చేయాల్సిన అవసరం ఉండదు, పాపాలు చేయాల్సిన అవసరం ఉండదు. విలాసవంతమైన జీవితమే జీవితం కాదని అర్థమవుతుంది, ఉండడానికి, ధరించడానికి, తినడానికి అవసరమైనంత ఉంటే సరిపోతుందని తెలుసుకుంటారు. ఉన్నదానితో సంతృప్తి చెందుతూ, తమ వద్ద ఉన్న వనరులన్నింటినీ ఆత్మకు లాభం కలిగించే జ్ఞాన సంపాదనపై పెడతారు.

ఇప్పుడు మీరందరూ అదే పని చేస్తున్నారు. ఏదో ఒక రోజు ఈ శరీరాన్ని వదిలి వెళ్ళాల్సి ఉంటుందని, ఈ శరీరాన్ని కుటుంబ సభ్యులు దహనం చేస్తారని, కానీ ఆత్మైన మీరు మీ ప్రయాణాన్ని కొనసాగిస్తారని తెలుసుకుంటారు. అలాగే జ్ఞానం సంపాదించుకుంటే మరింత ఉన్నత లోకాలకు వెళ్ళే అవకాశం ఉంటుందని కూడా అర్థం చేసుకుంటారు. ఈ విషయాలన్నీ తెలుసుకున్న తర్వాత జ్ఞానానికే అత్యున్నత ప్రాధాన్యం ఇస్తారు. ఎందుకంటే ధనం శరీరానికి ఉపయోగపడితే, జ్ఞానం ఆత్మకు ఉపయోగపడుతుంది. ఇక్కడ నేను, మా మేడమ్ ఇద్దరి జీవితాలను ఉదాహరణగా తీసుకుంటే ఈ విషయం మీకు చాలా స్పష్టంగా అర్థమవుతుంది. పత్రి గారి పరిచయం అయ్యే వరకు, అంటే

53 సంవత్సరాల పాటు, డబ్బు సంపాదించడం తప్ప ఇంకో ఆలోచన నాకు ఉండేది కాదు. అందరికంటే ఎంత బాగా జీవించాలి? ఎంత ఆనందించాలి? ఎంత ఎంజాయ్ చేశాము? అనే విషయాల గురించే ఆలోచించే వారం.

కానీ పత్రి గారు పరిచయం అయిన తర్వాత ఆయన కొన్ని బుర్ర తిరిగిపోయే మాటలు చెప్పారు. "నువ్వు దేహం కాదు" అని చెప్పారు. మీరు ఒకసారి బయటకు వెళ్ళి ఎవరికైనా "మీరు దేహం కాదు" అని చెప్పి చూడండి. ఏమవుతుందో మీకే తెలుస్తుంది. నాకు కూడా మొదట అదే పరిస్థితి ఎదురైంది. ఎందుకంటే అప్పటివరకు దేహమే నేను అని భావించేవాడిని. వీళ్లంతా నా అన్నలు, నా చెల్లెల్లు, నా తమ్ముళ్లు, మా అమ్మ, మా కుటుంబం అని అనుకుంటూ జీవించేవాడిని. డబ్బు సంపాదించడమే నా పని, అదే జీవితమని భావించేవాడిని.

ఎవరో చేగోడీలు, జంతికలు అమ్ముకుంటారు, కాని మాది రైస్‌మిల్ వ్యాపారం. నేను తవుడు, బియ్యం అమ్ముకునేవాడిని, ఎవరి జీవితం వారిది. ప్రతి ఒక్కరూ ఏదో ఒకటి అమ్ముకుంటూ, అదే జీవితమని అనుకుంటూ జీవిస్తారు.

కానీ సద్గురువు పరిచయం అయిన తర్వాత జీవితం పూర్తిగా మారిపోయింది. ధన సంపాదన కంటే జ్ఞాన సంపాదన వైపు అడుగులు పడ్డాయి. సద్గురువు లభించిన తర్వాత ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. జ్ఞానాన్ని ఎలా సంపాదించాలి? ఎలా పెంచుకోవాలి? జ్ఞానంలో ఎలా గొప్పవారిగా ఎదగాలి? జ్ఞానం పెరిగే కొద్దీ ఆత్మకు కలిగే లాభాలు ఏమిటి? మరణించిన తర్వాత ఎలాంటి ఉన్నత లోకాలకు వెళ్లగలరు? భవిష్యత్తులో ఎలాంటి గొప్ప జన్మలు పొందగలరు? వంటి అనేక విషయాలపై అవగాహన కలుగుతుంది. అలాగే ఇక్కడ ఉన్న ఏదీ శాశ్వతం కాదని, జరుగుతున్న ఏ సంఘటన కూడా శాశ్వతం కాదని అర్థమవుతుంది.

# ఈ జీవితమంతా ఒక నాటకం

**"ఈ జీవితమంతా ఒక నాటకం, ఒక సినిమా లాంటిదని అవగాహన కలుగుతుంది".**

సద్గురువు వల్ల ఈ నాటకంలో మీ పాత్రకు ఎంత ప్రాముఖ్యం ఇవ్వాలో అంతే ఇవ్వాలని తెలుస్తుంది. కానీ ఇదంతా శాశ్వత సత్యం కాదని, ఇది కూడా ఒక పాత్రలాంటిదని మాత్రమేనని అర్థమవుతుంది. జీవితంలో జరిగే ప్రతి విషయం అంతిమ సత్యంగా భావించకుండా చూడగల దృష్టి వస్తుంది. అప్పుడు గురువు చెప్పినట్లు పుస్తకాలు చదవడం ప్రారంభిస్తారు. కొత్త విషయాలు తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు, తెలుసుకున్న జ్ఞానానికి అనుగుణంగా జీవించడానికి ప్రయత్నిస్తారు. సత్సంగంలో పాల్గొంటారు, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతారు.

అంతేకాదు, తమలో ఉన్న లోపాలను గుర్తించి సరిచేసుకోవడం మొదలుపెడతారు. "నేను ఎక్కడ తప్పు చేస్తున్నాను?", "ఎక్కడ సరైన మార్గంలో లేను?" అనే విషయాలను పరిశీలించడం ప్రారంభిస్తారు. ఈ విధంగా జీవితం క్రమంగా మారిపోతుంది. పత్రిగారు లభించిన తర్వాత మా ఇద్దరి జీవితంలో కూడా ఇదే జరిగింది. పత్రిగారు పరిచయం అయిన తర్వాత మా జీవితం పూర్తిగా మారిపోయింది.

అంతకుముందు సంపాదించకపోతే జీవితం ఎలా సాగుతుంది అని అనుకునేవారం. కానీ తర్వాత అర్థమైంది, సంపాదనను పూర్తిగా మానేయమని ఎవరూ చెప్పడం లేదు. అయితే ధన సంపాదనతో పాటు జ్ఞాన సంపాదన కూడా చేయాలి అని తెలుసుకున్నాము. ఎప్పుడైతే మీరు జ్ఞానాన్ని సంపాదించడం ప్రారంభిస్తారో, ఆ జ్ఞానం మీ ఆత్మకు ఉపయోగపడుతుంది. మరుజన్మలో కూడా లోటులేని జీవితాన్ని పొందడానికి అది కారణమవుతుంది.

అందువల్ల సద్గురువు వల్ల మరణానంతర జీవితం గురించి ఎంతో అవగాహన కలుగుతుంది. ఒక్కో విషయం తెలుసుకుంటూ, ఆత్మకు లాభం

చేసే అంశాలను అర్థం చేసుకుంటూ, శరీరం ఉన్నప్పుడే ఆత్మకు ఉపయోగపడే పనులను చేయడం ప్రారంభిస్తారు. అంతకుముందు మీరు దేహం కోసం చేసే పనులకే ఎక్కువ సమయం కేటాయించేవారు. కానీ ఇప్పుడు వాటిని తగ్గించి, ఆత్మ లాభం కోసం, ఆత్మ ఉన్నతి కోసం చేయాల్సిన పనులపై ఎక్కువ దృష్టి పెడతారు.

ఒక విధంగా చూస్తే, సద్గురువు పరిచయానికి ముందు ఉన్న జీవితం మరియు తర్వాత ఉన్న జీవితం పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఆలోచనల్లో, ప్రాధాన్యతల్లో, జీవన విధానంలో, లక్ష్యంలో అన్నింటిలోనూ గొప్ప మార్పు వస్తుంది. అదే మరణానంతర జీవితం గురించి అవగాహన కలిగిన వ్యక్తి జీవితంలో కనిపించే నిజమైన పరివర్తన.

గత కొన్ని రోజులుగా మీరు ఈ జూమ్‌లో చాలా ముఖ్యమైన విషయాల గురించి తెలుసుకుంటున్నారు. అందులో భాగంగా మరణానంతర జీవితం గురించి తెలుసుకుంటున్నారు. ఈ విషయాన్ని మళ్ళీ గుర్తుంచుకోండి **"మరణానంతర జీవితం గురించి మీకు ఎంత అవగాహన ఉంటే, మీ జీవిత లక్ష్యానికి మీరు అంత దగ్గరవుతారు."**

మీరు కనిపించే ఈ భౌతిక జీవితం గురించి మాత్రమే తెలుసుకుంటే, మీకు జీవితంలో సగం మాత్రమే అర్థమైనట్లే. కానీ దీనికి అతీతంగా, మీకు కనిపించని మరో జీవితం కూడా ఉంది, దానినే మరణానంతర జీవితం అంటారు. చాలా మంది దానిపై దృష్టి పెట్టరు. అది తమకు సంబంధం లేనట్టుగా ప్రవర్తిస్తారు. అందువల్లే మీ జీవితంలో సమస్యలు, కష్టాలు, రోగాలు, బాధలు ఎందుకు వస్తున్నాయో మీకు అర్థం కావు. అవి ఒక్కసారిగా వచ్చినట్లు అనిపిస్తాయి.

అప్పుడు మీరు ఆశ్చర్యపోతారు "నా జీవితం ఇలా ఎందుకు మారిపోయింది? ఇంత దారుణమైన పరిస్థితి ఎందుకు వచ్చింది? నేను బ్రతకలేకపోతున్నాను, ఈ బాధను తట్టుకోలేకపోతున్నాను, నిన్నటి వరకు

అంతా బాగానే ఉంది. ఇప్పుడు ఇలా ఎందుకు జరిగింది?" అని బాధపడతారు.

ఏం చేయాలో అర్థం కాక, సమస్యలకు పరిష్కారం కూడా కనిపించదు, కొంతకాలం వాటిని భరిస్తారు. కొందరు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడతారు, కొందరు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు, మరికొందరు కుటుంబ సమస్యలతో కృంగిపోతారు, ఇంకొందరు వృద్ధాప్యం, ముసలితనం వల్ల కలిగే కష్టాలను అనుభవిస్తారు.

ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయో చాలా మందికి అర్థం కాదు. కారణం తెలుసుకోవాలనే ఉద్దేశంతో వివిధ గురువులను, మత పెద్దలను, పండితులను కలుస్తారు. వారి సలహాలు కోరతారు, కానీ వారిలో ఎవరైనా స్వార్థపరులై ఉంటే, మీ బలహీనతలను ఉపయోగించుకుని మిమ్మల్ని మరింతగా దోచుకుంటారు. అలాంటి వ్యక్తులు అన్ని సంస్థల్లోనూ, అన్ని రంగాల్లోనూ కనిపిస్తారు. ఫలితంగా, ఒక వైపు సమస్యలతో బాధపడుతూనే, మరో వైపు గురువుల వల్ల మోసపోయి మరింత మానసిక వేదనకు గురవుతారు. అలా జీవితంలో నలిగిపోతారు, కానీ అసలు కారణం మాత్రం తెలియదు.

ఎందుకంటే సమస్యకు కారణం తెలియనంత వరకు, ఆ సమస్య నుంచి పూర్తిగా బయటపడటం సాధ్యం కాదు. ఎందుకు అర్థం కావడం లేదు అంటే, కనిపించని జీవితం గురించి మీకు సరైన అవగాహన లేకపోవడమే ప్రధాన కారణం. జీవించి ఉన్నప్పుడు కనిపించే జీవితాన్ని మాత్రమే నిజమని భావిస్తారు. కానీ నిజానికి, మరణానికి ముందు ఉన్న జీవితంకంటే మరణానంతర జీవితం ఎంతో విస్తృతమైనది. దాని గురించి అవగాహన లేకపోతే మీ జీవితం సాఫీగా సాగదు, అయోమయం, గందరగోళం మధ్యనే గడుస్తుంది.

అందుచేత ఎవరి జీవితమైనా సజావుగా సాగాలంటే, చనిపోక ముందు ఉండే జీవితం గురించే కాకుండా, చనిపోయిన తర్వాత ఉండే జీవితం గురించి కూడా అవగాహన కలిగి ఉండాలి. మీరు అడగవచ్చు "చనిపోతే

జీవితం అంతమై పోతుందని అనుకుంటున్నాం. మరి నిజంగా చనిపోయిన తర్వాత కూడా జీవితం ఉంటుందా? మేము ఉంటామా?" అని.

అలా అనుకోవడం సహజమే. ఎందుకంటే మరణించిన వ్యక్తిని స్మశానానికి తీసుకువెళ్లి దహనం చేయడం మీరు కళ్లారా చూస్తారు. ఆ తర్వాత అతడు మళ్ళీ కనిపించడు, అందువల్ల అతని ఉనికి పూర్తిగా ముగిసిపోయిందనే నిర్ణయానికి అందరూ వస్తారు.

కానీ అపారమైన జ్ఞానం కలిగిన గురువులు కనిపించే ప్రపంచం గురించి మాత్రమే కాదు, కనిపించని వాటి గురించి కూడా వివరిస్తారు. వారు తమ అనుభవం, సాధన, జ్ఞానం ద్వారా ఈ విషయాలను అర్థం చేసుకుని ఇతరులకు తెలియజేస్తారు. అందుకే వారికి జీవితం యొక్క లోతైన అంశాలపై అవగాహన ఉంటుంది. మనిషికి కష్టాలు ఎందుకు వస్తాయి? బాధలు ఎందుకు ఎదురవుతాయి? జీవితం ఎందుకు ఒక్కోసారి అనూహ్య మలుపులు తిరుగుతుంది? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలిసిన వారే నిజమైన గురువులు. ఎందుకంటే **"మరణానికి ముందు ఉన్న జీవితానికి మరియు మరణానంతర జీవితానికి సంబంధం ఉంది".**

ఈ రెండింటిపై అవగాహన కలిగితే జీవితంలోని అనేక విషయాలు అర్థమవుతాయి. లేకపోతే కంటికి కనిపించేవే నిజమని భావిస్తారు. అందుచేత కంటికి కనిపించని మరణానంతర జీవితం గురించి తెలుసుకోవడం అవసరం. దాని గురించి ఎంత అవగాహన పెంచుకుంటే, అంత జ్ఞానం సంపాదించినట్టే.

నిజానికి, ఈ అవగాహన ఉన్న జ్ఞానులు చెప్పే మాటలు అవగాహన లేని వారికి అర్థం కావు, వాటిని నమ్మరు కూడా. అందువల్ల మూఢనమ్మకాలతో జీవిస్తూ, అనవసరమైన కష్టాలను అనుభవిస్తారు, శాంతిని కోల్పోతారు. జీవితమంతా దుఃఖంలోనే గడుపుతారు.

అందుచేత మరణానంతర జీవితం గురించి అవగాహన పెంచుకోవడం చాలా అవసరం. ఎందుకంటే మరణానికి ముందు ఉన్న

జీవితంలో చాలా మంది మాయలోనే జీవిస్తుంటారు. శాశ్వతం కాని వాటిని శాశ్వతమని భావిస్తారు. తమకు చెందని వాటినే తమవిగా అనుకుంటారు, వాటి కోసం జీవితమంతా శ్రమిస్తారు, తప్పులు, పాపాలు చేస్తారు.

విచిత్రం ఏమిటంటే, ఏదో ఒకరోజు వదిలి వెళ్లాల్సిన వస్తువులనే సంపాదించడానికి, కూడబెట్టడానికి, కాపాడుకోవడానికి జీవితమంతా వెచ్చిస్తారు, వాటిని చూసి ఆనందపడతారు. కానీ చివరకు వాటన్నింటినీ వదిలేసి వెళ్లిపోతారు.

అదే సమయంలో, నిజంగా తమతో పాటు ఉండే ఆధ్యాత్మిక సంపదను సంపాదించుకోవడానికి పెద్దగా ప్రయత్నించరు, కారణం, దాని గురించి అవగాహన లేకపోవడమే. చనిపోయిన తర్వాత ఈ ప్రపంచంలోని వస్తువులు, సంబంధాలు, సంపదలు శాశ్వతం కాదని స్పష్టంగా తెలుస్తుంది. వాస్తవం ఏమిటో అప్పుడు బోధపడుతుంది. కానీ జీవించి ఉండగానే మాయ ఏమిటో, వాస్తవం ఏమిటో తెలుసుకున్నవాడు ఎంతో గొప్పవాడు.

అందుకే ఆది శంకరాచార్యులు సాధకులకు సాధన చతుష్టయం గురించి బోధించారు. అందులో మొదటిది వివేకం. అంటే “నిత్యా నిత్య వస్తు వివేకం” అంటే ఏది నిత్యమైనది, ఏది అనిత్యమైనది అనే స్పష్టమైన అవగాహన.

అంటే ఏది శాశ్వతం? ఏది తాత్కాలికం? ఏది మాయ? ఏది వాస్తవం? అనే జ్ఞానం ముందుగా సంపాదించుకోవాలని చెప్పారు. ఈ అవగాహన లేకుండా మోక్షం ఎలా లభిస్తుంది? దుఃఖం ఎలా తొలగుతుంది? కష్టాలు ఎలా తగ్గుతాయి? మనశ్శాంతి ఎలా కలుగుతుంది? అన్నవి తెలియవు.

అందుచేత ప్రతి ఒక్కరూ మరణానంతర జీవితం గురించి అవగాహన పెంచుకోవాలి. అదే పనిని మీరు ప్రస్తుతం చేస్తున్నారు. ఈ విషయం ఎంతో ముఖ్యమైనది కాబట్టే ఇన్ని రోజులుగా దీని గురించి చెప్పుకుంటున్నాం.

మరణానంతర జీవితం గురించి అవగాహన పెరిగే కొద్దీ, జీవితం యొక్క అసలు అర్థం స్పష్టమవుతుంది.

ఈ మరణానంతర జీవితం గురించి అవగాహన పెంచుకుని, జీవిత లక్ష్యాన్ని చేరుకుంటే  మరొక జన్మ ఉండదు. ప్రతి ఒక్కరూ ఆ ప్రయత్నం చేయాలి. ఇంతమంది, ఇన్ని వందల మంది ఇక్కడికి రావడానికి ముఖ్య కారణం కూడా అదే, ఆ లక్ష్యాన్ని సాధించడానికే ఈ ప్రయత్నం చేస్తున్నాం.

**"ఆత్మలైన మీకు ఆ పూర్ణాత్మలు నిర్దేశించిన లక్ష్యం ఏమిటంటే? మీరు కూడా మాలాగే పూర్ణాత్మలు కావాలి"** అని. ఈ ప్రయత్నం సాధారణంగా అనేక జన్మల అనుభవాల తర్వాత ప్రారంభమవుతుంది. అప్పటివరకు భోగాలు, ఇంద్రియ సుఖాలు, కోరికలు, సరదాల మీదే ఆసక్తి ఉంటుంది. ఆ జన్మల్లో సుఖాలతో పాటు ఎన్నో కష్టాలను కూడా అనుభవిస్తూ ఉంటారు.

ఆ కష్టాలు ఎక్కువైనప్పుడు, "ఇదేమి జీవితం?", "ఇలాంటి కష్టాలు లేకుండా జీవించలేమా?" అనే ప్రశ్నలు కలుగుతాయి. అలా అనిపించినప్పుడు ఒక సద్గురువును ఆశ్రయిస్తారు. అప్పుడు ఆ సద్గురువు ఏమి చెబుతారంటే "మీకు ఇవ్వబడిన ఈ జన్మ సుఖభోగాలను అనుభవించడానికి కాదు. జనన-మరణ చక్రం నుంచి విముక్తి పొందడానికి" అని చెబుతారు.

అంతేకాదు, ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన సాధనను కూడా బోధిస్తారు. ఆ సాధన ద్వారా జ్ఞానాన్ని సంపాదించి, క్రమంగా పూర్ణజ్ఞానాన్ని పొందితే మీ లక్ష్యాన్ని సాధించగలుగుతారు. అప్పుడు మీరు ఈ బాధల నుంచి, సమస్యల నుంచి, కష్టాల నుంచి పూర్తిగా బయటపడతారని ఆ సద్గురువు వివరిస్తారు.

ఇంకా ఆయన ఏమి చెబుతారంటే "ఇప్పటివరకు మీరు కంటికి కనిపించే ప్రపంచం గురించే తెలుసుకుంటున్నారు, కానీ కనిపించని జీవితం కూడా ఉంది, ఆ విషయాలు మీకు మరణానంతరం స్పష్టంగా తెలుస్తాయి, అయితే వాటిని ఇప్పుడే తెలుసుకోవడానికి ప్రయత్నించాలి" అని చెబుతారు. ఆ విషయాలను తెలుసుకోవడమే జ్ఞానాన్ని పెంచుకోవడం. మీరు ఎంత ఎక్కువ తెలుసుకుంటే, మీరు జీవించే విధానంలో అంత ఎక్కువ మార్పు వస్తుంది.

ప్రస్తుతం మీరు జీవిస్తున్న విధానం మిమ్మల్ని మీ అంతిమ లక్ష్యానికి దగ్గర చేయక పోవచ్చు. అందుకే మరణానంతర జీవితం గురించి అవగాహన పెంచుకుంటే, మీ ప్రవర్తన పూర్తిగా మారిపోతుంది. సృష్టి నియమాలకు అనుగుణంగా జీవించడం ప్రారంభిస్తారు. అలా జీవించడం వల్ల మీరు మీ లక్ష్యానికి మరింత దగ్గరవుతారు.

అప్పుడు మీరు గురువుని అడుగుతారు "మరణించిన తర్వాత ఏమి జరుగుతుంది?", "మనం ఏమి తెలుసుకోవాలి?", "ఆ విషయాలను వివరించండి" అని. అప్పుడు ఆ గురువు ద్వారా ఎన్నో విషయాలు, మరణానంతర జీవితం గురించి ఉన్న అనేక అంశాలను తెలుసుకుంటారు.

విచిత్రం ఏమిటంటే, ఆ గురువు చెప్పే విషయాలన్నీ కూడా మీరు జీవించే విధానానికి పూర్తి భిన్నంగా ఉంటాయి. మీకు ఆశ్చర్యం వేస్తుంది. మొదట మీరు నమ్మలేరు. ఆయన చెప్పేది నిజమా? కాదా? అనే సందేహం కూడా ఉంటుంది.

ఎన్నో జన్మల నుంచి అలవాటైన విషయాలన్నీ మార్చుకోవాలంటే చాలా కష్టంగా అనిపిస్తుంది. గురువుగారు చెప్పినట్టుగా జీవించడం సాధ్యం కాదేమో అనిపిస్తుంది. కానీ గురువుగారు చెప్పిన విధంగా జీవిస్తూ, జ్ఞానాన్ని పెంచుకుంటూ వెళ్తే కచ్చితంగా మీరు మీ లక్ష్యానికి దగ్గరవుతారు.

నిజం చెప్పాలంటే, పత్రి గారు చెప్పిన విషయాలు మొదట్లో నన్ను కూడా గందరగోళంలో పడేశాయి. నేను కూడా మొదట నమ్మలేదు, ఎంతో అధ్యయనం చేసిన తర్వాత ఆయన చెప్పింది సత్యమని అర్థం చేసుకున్నాను. నాకు అర్థమైనప్పటి నుంచి ఆయన చెప్పిన విషయాలను ఆచరించడం ప్రారంభించాను.

ఆయన చెప్పిన కొన్ని విషయాలు ఇప్పుడు చెబుతాను. ఇందులో మీరు ఎన్ని అర్థం చేసుకున్నారో, ఎన్ని ఆచరిస్తున్నారో చూసుకోండి.

ముందు ఈ విషయాలను తెలుసుకుంటారు. తర్వాత వాటిని

మననం చేసుకుంటారు, అలా మననం చేస్తూ, ఆచరిస్తూ అంటే వాటిపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. అలా చేస్తూ చేస్తూ అవి పూర్తిగా అర్థమవుతాయి. అంటే వాటిపై అవగాహన ఏర్పడుతుంది, అప్పుడు ఆ విధంగా జీవించడం ప్రారంభిస్తారు.

మీ జీవితంలో విపరీతమైన మార్పులు వస్తాయి, మీరు చేసే పనులు అందరినీ ఆశ్చర్యపరుస్తాయి. కొందరు మిమ్మల్ని పిచ్చివాళ్ళని కూడా అనుకోవచ్చు. అంతకుముందు ఉన్న జీవితం మీకు ఉండదు. “ఇలా ఎలా మారిపోయారు?” అని అడుగుతారు.

అయినా మీ ప్రవర్తన మారదు, ఎవరు ఏమనుకున్నా, ఎన్ని విమర్శలు చేసినా మీరు మీ మార్గంలోనే కొనసాగుతారు, రోజులు గడిచే కొద్దీ మీ ప్రవర్తన మరింత పరిణతి చెందుతుంది. అందుచేత పత్రి గారు చెప్పిన విషయాలను మరోసారి గుర్తు చేసుకుందాం. కావాలంటే మీరు పాయింట్ల వారీగా రాసుకోండి.

1) “ఈ దేహం నేను కాదు” అన్న విషయం మీకు అర్థమవుతుంది. “నేను ఆత్మను” అనే అవగాహన కలుగుతుంది. అంతకుముందు ఈ దేహమే నేను అని అనుకునేవారు, ఆత్మ గురించి సరైన అవగాహన ఉండేది కాదు. అది ముందున్న పరిస్థితి. గురువుగారు చెప్పిన తర్వాత ఈ విషయం అర్థమవుతుంది. అలాగే “నేనే కాదు, అందరూ ఆత్మలే” అన్న సత్యం కూడా మీకు అర్థమవుతుంది.

2) పత్రి గారు ఏమన్నారు అంటే “విగ్రహం దేవుడు కాదు నాయనా, ఆత్మే దేవుడు, ఆత్మే భగవంతుడు” అని చెప్పారు. “విగ్రహారాధన కాదు, ఆత్మారాధన చేయాలి” అన్నారు. చాలా కాలం వరకు నాకు అది అర్థం కాలేదు, చెప్పినా నమ్మలేదు. కానీ తర్వాత ఎంతో అధ్యయనం చేసిన తర్వాత ఆయన చెప్పింది సత్యమని అర్థమైంది. అప్పటివరకు నా అభిప్రాయం ఏమిటంటే, విగ్రహమే భగవంతుడు అనే భావంలో ఉండేవాడిని. ఇక్కడ ఒక మందిరం

కూడా కట్టించాను, మీరు ఆ ప్రక్కకు వెళ్ళి చూస్తే కనిపిస్తుంది. ప్రతి సంవత్సరం తిరుపతికి వెళ్ళేవాడిని, చిన్ననాటి నుంచి అదే అభిప్రాయంతో పెరిగాను.

ఇవన్నీ ఒక్కొక్కటి ఆలోచిస్తే మీ ఆలోచనా విధానాన్నే మార్చేస్తాయి. మీలో కొంతమంది ఇప్పటికీ ఇవి నమ్మకపోవచ్చు. "విగ్రహం భగవంతుడు కాదు'' అని చెప్పినప్పుడు ఎంతమంది ఒప్పుకుంటారు? కొద్దిమందే ఒప్పుకుంటారు. కారణం ఆత్మే భగవంతుడు అని చెప్పడం వల్ల.

3) కానీ పత్రిగారు చెప్పిన ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే? "ఆత్మే భగవంతుడు" అని తెలుసుకున్నాం. కానీ ఆ ఆత్మ ఎవరో కాదు మీరే ఆ ఆత్మ, అంటే మీరే ఆ దైవం అని చెప్పారు. ఇది వినగానే చాలామందికి ఆశ్చర్యంగా అనిపిస్తుంది, మెల్లిగా అధ్యయనం చేస్తే తెలుస్తుంది. వేదాలలో కూడా "అహం బ్రహ్మోస్మి" అని చెప్పబడింది కదా?

అప్పుడు నేనే దేవుడినా? అని అడిగితే, "నువ్వే దేవుడివయ్యా!" అన్నారు. అప్పుడు ఇంకా ఆశ్చర్యం వేసింది, ఆయన చెప్పే ఒక్కో విషయం అర్థం చేసుకోవడం చాలా కష్టంగా వుండేది. నమ్మశక్యం కాకుండా వుండేది.

యాభై సంవత్సరాల పైగా ఒక ఫోటో పెట్టి, ఒక విగ్రహం పెట్టి పూజ చేస్తూ, "నువ్వే నా కోరికలు తీర్చాలి, నువ్వే నన్ను ఆదుకోవాలి, నువ్వే నన్ను రక్షించాలి, నా కష్టాల నుంచి నువ్వే బయటపడేయాలి" అని ప్రార్థిస్తూ వచ్చిన వాడిని నేను. దేవుడు ఎక్కడో ఉంటాడు అనే భావంలో ఉన్న నాకు "నువ్వే దేవుడివయ్యా!" అంటే ఆ భావం నుంచి బయటపడటానికి నాకు చాలా కాలం పట్టింది. ఇదే జ్ఞానం పెంచుకోవడం అంటే, ఈ జ్ఞానం పెరిగితే తప్ప మీరు మీ లక్ష్యాన్ని చేరుకోలేరు, మోక్షం పొందలేరు. అందుకే నేను చాలా అధ్యయనం చేయవలసి వచ్చింది, పత్రి గారు చెప్పారని వెంటనే ఒప్పుకోలేదు, అలా అని కొట్టిపారేయలేదు. ప్రతి విషయాన్ని లోతుగా పరిశీలించాను.

మొదట ఆయన ఏమన్నారు? "నువ్వు ఆత్మవు" అన్నారు. ముందు

దాన్ని నిర్ధారించుకోవాలి. "నేను ఈ దేహమా? లేక ఆత్మనా?" అనే చర్చ మీరు మీలో చేసుకుంటే, చివరికి మీకు స్పష్టంగా అర్థమవుతుంది "నేను ఆత్మను, నేను దేహం కాదు" అన్నది ఒక విషయం. ఇప్పుడు రెండో విషయం. ఆయన ఏమన్నారు? "విగ్రహం దేవుడు కాదు, ఆత్మే దేవుడు" అన్నారు. దీనిని కూడా మీరు అర్థం చేసుకోవాలి.

ఇక్కడ మీరు ప్రశ్నించుకోవాలి. "విగ్రహం ఎందుకు దేవుడు కాదు? ఆత్మే ఎందుకు దేవుడు?" అని. ఈ రెండు ప్రశ్నల మీద మీరు అధ్యయనం చేయాలి. ఈ విషయాల మీద మీరు ఎంత లోతుగా ఆలోచించగలరో, అంత జ్ఞానం మీకు పెరుగుతుంది.

ఇది సాధారణ విషయం కాదు. చాలా జాగ్రత్తగా ఆలోచించాలి. లేకపోతే మనసు గందరగోళానికి గురవుతుంది. మీరు బయటకు వెళ్ళి విగ్రహం దేవుడు కాదు అని చెబితే చాలామంది ఒప్పుకోరు, కొందరు మిమ్మల్ని పిచ్చివాడని కూడా అనవచ్చు.

అందుకే నేను ఇప్పుడు డైరెక్ట్‌గా చెప్పను. కొంత అవగాహన పెరిగిన తర్వాత, ఇండైరెక్ట్‌గా చెబుతాను. ఆశ్చర్యం ఏమిటంటే, నేను చెప్పిన విధానాన్ని ఆలయాల్లోని కొందరు పూజారులు కూడా అంగీకరించారు, మీరు చెప్పింది కరెక్టే అని అన్నారు.

అందుకే బుద్ధి పెరగాలి అంటాను. ఇప్పుడు విగ్రహం ఎందుకు దేవుడు కాదు? అన్నది తెలుసుకోవాలి. ముందు మీరు తెలుసుకోవాల్సింది ఏమిటంటే "విగ్రహం అసత్యం, భగవంతుడు సత్యం". ఇక్కడ సత్యం అంటే ఏమిటో ముందుగా తెలుసుకోవాలి. సత్యం యొక్క లక్షణాలను పూర్తిగా అర్థం చేసుకోవాలి. అప్పుడు మీరు పరిశీలించండి విగ్రహం సత్యమా? ఆత్మ సత్యమా? అని.

ఎప్పుడైతే ఆత్మే సత్యం అని మీకు అర్థమవుతుందో, అప్పుడే ఆత్మే భగవంతుడు అని కూడా అర్థమవుతుంది. నేను ఈ విషయం మీద చాలా

అధ్యయనం చేశాను, ఎన్నో చోట్లకు వెళ్ళాను. మొదట్లో పూజల గురించి, మాంసాహారం గురించి మాట్లాడినప్పుడు చాలామంది నన్ను పిలవడం కూడా మానేశారు, కొన్ని చోట్ల గొడవలు కూడా జరిగాయి.

కానీ నేను భయపడలేదు, ఎందుకంటే నేను చెప్పేది సత్యం అని నాకు నమ్మకం ఉంది. కొంతమంది దూరమైనా, నన్ను ఆహ్వానించే వారు మరింత పెరిగారు. అప్పుడు సత్యం యొక్క శక్తి నాకు అర్థమైంది. ఆ తర్వాత కొంత బుద్ధి పెరిగిన తర్వాత డైరెక్ట్‌గా కాకుండా, ఇండైరెక్ట్‌గా చెప్పడం ప్రారంభించాను. మీకు ఆసక్తి ఉంటే నేను మొదట్లో వ్రాసిన పుస్తకాలు చదవండి. విగ్రహారాధన, పూజలు, ఆత్మజ్ఞానం వంటి విషయాల మీద చాలా వ్రాశాను. 1) "భగవంతుడు అంటే?", 2) "సత్యమార్గం!", 3) "ఆత్మశాస్త్రం!", 4)"శాస్త్రాల అర్థం – అంతరార్థం" వంటి పుస్తకాలు చదవండి.

ఈ పుస్తకాలు ఎలా వ్రాయగలిగాను అంటే, వాటి మీద నిరంతరం అధ్యయనం చేయడం వల్ల, అవగాహన పెంచుకోవడం వల్ల. లోకంలో చాలామంది "విగ్రహమే దేవుడు" అంటారు, కానీ నేను "ఆత్మే దేవుడు" అంటాను. కొంతమంది "విగ్రహం దేవుడు కాదు అని చెప్పడం ఎందుకు? ఆత్మే దేవుడు అని మాత్రమే చెప్పండి" అని అంటారు. కానీ ఒక విషయం గుర్తుంచుకోండి. ఇప్పటివరకు వారికి తెలిసింది విగ్రహమే దేవుడు అని. కానీ ఇప్పుడు మీరు ఆత్మే దేవుడు అంటున్నారు. అప్పుడు వారి మనసులో ఒక ప్రశ్న వస్తుంది అయితే నిజంగా దేవుడు ఎవరు? అని.

ఇప్పుడు ముఖ్యమైన రెండు విషయాలు మాత్రమే గుర్తుంచుకోండి:

మొదటిది: ఆత్మే భగవంతుడు. రెండవది: మీరు ఆత్మ.

ఈ రెండూ మీకు స్పష్టంగా అర్థమైతే, ఆత్మ భగవంతుడు, మీరు ఆత్మ అయితే "నేనే దేవుణ్ణి" అనే అవగాహన వస్తుంది. అప్పుడు కష్టం వచ్చిన ప్రతిసారి బయట ఉన్న విగ్రహాన్ని అడగరు. "బాబా.. బాబా..", "సాయి.. సాయి.." అంటూ బయట సహాయం కోసం ఎదురుచూడరు. కష్టం వచ్చినప్పుడు

మీ ఆత్మ మీద దృష్టి పెడతారు, ధ్యానంలో కూర్చుంటారు. ఎందుకంటే ఆత్మ కంటే గొప్ప దేవుడు ఎవరూ లేరు. మీరు మీ మీద మీరు దృష్టి పెట్టడం ప్రారంభిస్తారు, అదే నిజమైన భక్తి. భక్తి అంటే పువ్వులు వేయడం, హారతి ఇవ్వడం, గంట కొట్టడం, నైవేద్యం పెట్టడం మాత్రమే కాదు.

**"నీ స్వరూపంతో నీవు అనుసంధానమై ఉండడమే నిజమైన భక్తి".**

వేదాల్లో కూడా ఉంది: **"స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభిధీయతే."** అని. అంటే, తన నిజస్వరూపమైన ఆత్మతో అనుసంధానమై ఉండడాన్నే భక్తి అంటారు. ఆ మార్గమే పత్రీజీ ఇచ్చిన "శ్వాస మీద ధ్యాస".

ఎవరైతే "శ్వాస మీద ధ్యాస" ఉంచుతారో వారే నిజమైన భక్తులు.

ఇది మీకు ఆశ్చర్యంగా అనిపించవచ్చు. ఎందుకంటే మీకు అలవాటైన భక్తి అంటే అగరబత్తులు వెలిగించడం, హారతి ఇవ్వడం, గంట కొట్టడం, కళ్లకు అద్దుకోవడం, నైవేద్యం పెట్టడం, భజనలు చేయడం.

కానీ వేదాలు, ఉపనిషత్తులు చెప్పేది వేరే. మీ స్వరూపం ఆత్మ, ఆ ఆత్మే భగవంతుడు, ఆ భగవంతుడైన మీ స్వరూపంతో మీరు అనుసంధానమై ఉండడమే అసలైన భక్తి. అందుకే మనమందరం చేస్తున్న సాధన కూడా అదే.

ఒక విషయం గుర్తుంచుకోండి. విగ్రహం మీద ఎన్ని సంవత్సరాలు దృష్టి పెట్టినా మీలో పెద్ద మార్పు రాకపోవచ్చు. కానీ ఆత్మ మీద దృష్టి పెట్టండి. మీ జీవితంలో విపరీతమైన మార్పులు వస్తాయి. చెడు గుణాలు పోతాయి, చెడు లక్షణాలు పోతాయి, చెడు అలవాట్లు పోతాయి, చెడు మాటలు పోతాయి, చెడు వ్యసనాలు పోతాయి. చివరికి చెడు అనే భావనే మీలో ఉండకుండా మార్పు వస్తుంది.

ఆత్మ మీద మీరు దృష్టి పెట్టినప్పుడు, ఆ ఆత్మ ఎవరు? ఆత్మే భగవంతుడు. లోకంలో ఉన్న నమ్మకం ఏమిటంటే, భగవంతుని దర్శిస్తే సకల శుభాలు కలుగుతాయి, కోరికలు నెరవేరుతాయి, కష్టాలు తొలగిపోతాయి

అని. ఈ నమ్మకంతోనే చాలామంది విగ్రహాన్ని ఆశ్రయిస్తారు, కారణం ఏమిటంటే, విగ్రహమే దైవం అనే భావం. కానీ నిజమైన సత్యమైన దేవుడు ఎవరు? అంటే "ఆత్మ".

అందుచేత ఎప్పుడైతే మీరు "ఆత్మ"ను ఆశ్రయిస్తారో, అప్పుడు దేవుణ్ణి ఆశ్రయించినట్టు. విగ్రహాన్ని ఆశ్రయిస్తే లభిస్తాయని మీరు అనుకున్న ఫలితాలన్నీ సహజంగానే మీకు లభిస్తాయి.

దేవుణ్ణి ఆశ్రయిస్తేనే ఫలితాలు వస్తాయి. కానీ దేవుడు ఎవరు? ఎవరిని ఆశ్రయించాలి? దేవుడు 'ఆత్మ'. ఆత్మను ఆశ్రయించాలి. మరి 'ఆత్మ'ను ఆశ్రయించాలంటే ధ్యానం చేయాలి. దీనిని బట్టి పూజ గొప్పదా? ధ్యానం గొప్పదా? అంటే స్పష్టంగా ధ్యానం గొప్పది అని చెప్పవచ్చు.

ఉత్తర గీతలో ఏమని చెప్పబడింది అంటే?

**"పూజా కోటి సమం స్తోత్రం,**
**స్తోత్ర కోటి సమో జపం,**
**జప కోటి సమం ధ్యానం,**
**ధ్యాన కోటి సమో లయః"**

ధ్యానం ద్వారా ఏ మనస్సు అయితే మిమ్మల్ని మాయలో ముంచిందో, అదే మనస్సు ధ్యానం ద్వారా ఆత్మలో లయమైపోతుంది. అప్పుడు "నువ్వే భగవంతుడివి" అనే సత్యం మీకు అర్థమవుతుంది. "అహం బ్రహ్మాస్మి" అనే మహావాక్యంలోని సత్యం మీకు అనుభవంలోకి వస్తుంది. "ధ్యాన కోటి సమో లయ:" అని ఎందుకు అన్నారు?

ఎందుకంటే ధ్యానం ద్వారా మనస్సు లయమైపోయినప్పుడే "నేనే భగవంతుడిని" అనే సత్యం స్పష్టంగా అర్థమవుతుంది. పత్రి గారు ఏమన్నారు? "నువ్వు దేహం కాదు." అని చెప్పారు.

"నువ్వే ఆత్మ" అని చెప్పారు. అలాగే "విగ్రహం దేవుడు కాదు" ఆత్మే దేవుడు అని చెప్పారు.

చివరికి నేను ఆత్మను, ఆత్మే దేవుడు, అంటే నేనే దేవుణ్ణి అని అర్థమవుతుంది.

పత్రి గారు చెప్పిన విషయాల్లో ఇంకా చాలా ఉన్నాయి, ఒక్కోటి ఆశ్చర్యపరిచేవే, మొదట వినగానే నమ్మలేనివిగా అనిపిస్తాయి.

మరణానంతర జీవితము గురించి ఒక ముఖ్యమైన విషయం గుర్తుపెట్టుకోండి. కంటికి కనిపించని విషయాలపై అవగాహన పెంచుకోవాలి. ఎందుకంటే కంటికి కనిపించేవి చాలా స్వల్పం, కనిపించనివి అనేకం ఉన్నాయి. ఆ కనిపించని విషయాల గురించి ఎంత ఎక్కువ అవగాహన పెంచుకుంటే, అంత ఎక్కువ జ్ఞానం సంపాదించుకున్న వారవుతారు.

నా జీవితంలో పత్రి గారిని ఎంతో దగ్గరగా అనుసరించాను, ఆయన ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ఆయన ఎక్కువగా జ్ఞానం గురించే చెప్పేవారు. అంటే, కంటికి కనిపించని సత్యాల గురించే ఎక్కువగా వివరించేవారు. అంతకుముందు నాకు ఆ విషయాల గురించి పెద్దగా అవగాహన ఉండేది కాదు, అందుకే ఆయన సందేశాలు నాలో ఎంతో ఆసక్తిని కలిగించాయి.

ఆయన ఎక్కడ, ఏ సందర్భంలో ఏమి చెప్పినా నేను నోట్ చేసుకునేవాడిని. తరువాత వాటిని ఒక డైరీలో వ్రాసుకుని వాటిని పదే పదే చదవడం వల్ల ఎంతో అవగాహన పెరిగింది, ఎన్నో విషయాలు నేర్చుకున్నాను, అందుకే నా జీవితం పూర్తిగా మారిపోయింది.

కంటికి కనిపించే విషయాల కంటే, కనిపించని విషయాలకే ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం ప్రారంభించాను. దాని ఫలితంగా నా జీవితంలో దుఃఖం క్రమంగా తగ్గిపోయింది, అశాంతి దూరమైంది, భయం పోయింది, ధైర్యం పెరిగింది. సత్యంపై అవగాహన పెరిగింది, ధర్మా చరణ ప్రారంభమైంది, అంతరాత్మను అనుసరించడం మొదలుపెట్టాను.

ఎందుకంటే ఆత్మ ఎప్పుడూ కంటికి కనిపించని సత్యాలకే ప్రాముఖ్యం

ఇస్తుంది. మనసు మాత్రం కంటికి కనిపించే విషయాలకే ప్రాముఖ్యం ఇస్తుంది. అందుకే ఆధ్యాత్మిక విషయాలు అంటే కంటికి కనిపించని విషయాలని తెలుసుకోవాలి. ప్రాపంచిక విషయాలని అంటే కంటికి కనిపించే విషయాలని అర్థం చేసుకోవాలి.

మీరు కంటికి కనిపించని విషయాల గురించి ఎంత ఎక్కువ తెలుసుకుంటే, ఆధ్యాత్మికంగా అంత ఎదుగుతారు, ప్రపంచంలో కూడా అంత గొప్పవారవుతారు. ఎందుకంటే మీరు "నేను ఆత్మను" అనే సత్యాన్ని తెలుసుకున్నారు. అందువల్ల ఈ "నేను" యొక్క లక్ష్యం ఏమిటంటే తనను తాను తెలుసుకోవడం, అలాగే తనను తాను చేరుకోవడమే గమ్యం.

ఈ సత్యాన్ని తెలుసుకుని, దానికి అనుగుణంగా ప్రయత్నించే వ్యక్తినే 'ఆత్మజ్ఞాని' అంటారు. 'ఆత్మజ్ఞాని' తన లక్ష్యాన్ని, తన గమ్యాన్ని స్పష్టంగా తెలుసుకుంటాడు. ఆ లక్ష్యానికి అనుగుణంగా తన గమనాన్ని, అంటే తన జీవిత ప్రయాణాన్ని కొనసాగిస్తాడు, ఈ ప్రయాణంలో అతని జ్ఞానం విస్తరిస్తూ ఉంటుంది.

చాలామందికి ఒక సందేహం ఉంటుంది. "ఆత్మజ్ఞానం ఎందుకు సంపాదించుకోవాలి" అని. ఎందుకంటే?ఆత్మజ్ఞానం లేకపోతే కుటుంబ బాంధవ్యాలు సక్రమంగా ఉండవు. తల్లిదండ్రులతో మంచి సంబంధాలు ఉండవు, భార్యాభర్తల మధ్య సరైన అవగాహన ఉండదు, చివరికి పిల్లలతో కూడా అనుబంధం దెబ్బతింటుంది.

ఆత్మజ్ఞానం లేకపోతే మనుషులు తరచూ గొడవలు పడుతుంటారు, తగాదాలు పడుతుంటారు, ఒకరినొకరు నిందించుకుంటుంటారు, కొన్నిసార్లు దూరమవుతారు, మరికొన్నిసార్లు విడాకుల వరకు కూడా వెళ్తారు.

ఇలాంటి పరిస్థితులు ఎందుకు వస్తున్నాయో వారికి అర్థం కాదు. "నేను బాగానే ఉన్నాను, లోపం ఎదుటి వారిలో ఉంది" అని అనుకుంటారు. విచిత్రమేమిటంటే, ఇద్దరూ ఇదే అభిప్రాయంతో ఉంటారు. కానీ అసలు లోపం

ఆత్మజ్ఞానం లేకపోవడమే.

ఈ విషయం అర్థం కాకపోవడం వల్ల పెద్దవాళ్ళు అయినా, చిన్నవాళ్ళు అయినా, అదే విధంగా గొడవలు పడుతుంటారు. ఒకరినొకరు తప్పుపడుతుంటారు, చివరికి దూరమై జీవిస్తుంటారు. అందుకే జీవితంలో శాంతి, సంతోషం, సత్సంబంధాలు కావాలంటే ఆత్మజ్ఞానాన్ని సంపాదించడం ఎంతో అవసరం. అందుకే పత్రి గారు **"ఆత్మజ్ఞానం లేకపోతే సంసారం నరకం, ఆత్మజ్ఞానం ఉంటే సంసారం స్వర్గం."** అంతా మీ చేతిలోనే ఉంది అంటారు.

అందుకే పెద్దలు **"ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు"** అని చెప్పారు. మరి వాస్తవం ఎలా మారుతుంది? మీ వాస్తవాన్ని ఎవ్వరూ మార్చలేరు. మిమ్మల్ని మీరు మాత్రమే మార్చుకోగలరు. అద్భుతమైన సృష్టి సిద్ధాంతం ఏమిటంటే, **"ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి".** అది ఎలా సాధ్యం? ఆత్మజ్ఞానం ద్వారా సాధ్యం. మీరంతా అటువంటి జ్ఞానాన్ని సంపాదించు కోవడానికే వచ్చారు.

ఇక్కడ అపారంగా ధ్యానం చేయడం వల్ల, అద్భుతమైన జ్ఞానుల సాంగత్యం వల్ల, ఇంటి దగ్గర నిరంతరం చదవడం వల్ల, ఈ మార్గంలో సేవ చేయడం వల్ల మీకు తెలియకుండానే జ్ఞానం పెరుగుతుంది. దాని ఫలితంగా సంసారంలో, బాంధవ్యాలలో మార్పులు వస్తాయి.

మా ఇద్దరి జీవితంలో కూడా ఇదే జరిగింది. ఈ ధ్యాన మార్గంలోకి రాకముందు, ఈ జ్ఞానం పొందక ముందు మా ఇద్దరి మధ్య కూడా గొడవలు ఉండేవి. ఆ సమయంలో ఒకసారి మనస్పర్థలు వస్తే మళ్ళీ మామూలుగా కలవడానికి, సంతోషంగా మాట్లాడుకోవడానికి రెండు, మూడు రోజులు వారం రోజులు, కొన్నిసార్లు పది నుంచి పదిహేను రోజులు కూడా పట్టేది.

అదే ఇప్పుడు గమనిస్తే తేడా స్పష్టంగా కనిపిస్తుంది. ఏదైనా అభిప్రాయ భేదం వచ్చినా కొంతసేపటికే మళ్ళీ మామూలుగా మాట్లాడుకుంటాం. మీరు కూడా ఇక్కడే ఎన్నో సందర్భాల్లో దీనిని గమనించి

ఉంటారు.

ఇంతకు ముందు జ్ఞానం లేనప్పుడు రోజులు పట్టేది. జ్ఞానం పెరిగిన తర్వాత మాత్రం క్షణాల్లోనే మనసు మారిపోతుంది. మీరు మీ చిన్న పిల్లలతో లేదా మనవలతో ఎప్పుడైనా కోప్పడ్డారని అనుకుందాం. గమనించండి కొద్దిసేపటికే వారు వచ్చి మిమ్మల్ని హత్తుకుంటారు. మీరు కోప్పడ్డారన్న విషయం కూడా వారు మరిచిపోతారు.

ఎందుకంటే జ్ఞానం పెరిగితే చిన్న పిల్లల మనస్తత్వం వస్తుంది. వారి కోప తాపాలు నీటి మీద వ్రాతల్లా ఉంటాయి, క్షణాల్లో చెరిగిపోతాయి. కానీ అజ్ఞానంలో ఉంటే కోప తాపాలు గ్రానైట్ రాయిపై చెక్కిన అక్షరాలలా ఉంటాయి, అవి సంవత్సరాలైనా చెరిగిపోవు.

విడాకుల విషయానికొస్తే, భర్తను అడిగితే భార్యలోనే లోపం ఉందంటాడు, భార్యను అడిగితే భర్తలోనే లోపం ఉందంటుంది. ఇద్దరూ తమ తప్పులు చూసుకోరు, కానీ అసలు సమస్య వ్యక్తులలో కాదు, అవగాహన లేకపోవడంలో ఉంది.

గుర్తుపెట్టుకోండి మీ భార్యను మార్చుకుంటే మీ సంసారం బాగుపడదు, అలాగే మీ భర్తను మార్చుకున్నాకూడా మీ సంసారం బాగుపడదు. మిమ్మల్ని మీరు మార్చుకున్నప్పుడే సంసారం బాగుపడుతుంది. అందుకే "వ్యక్తులను మార్చడం కాదు, అవగాహనను పెంచుకోవడమే పరిష్కారం."

ఎవరైనా "ఆయనతో జీవించడం కష్టం", "ఆమెతో జీవించడం కష్టం" అని అంటుంటారు. కానీ అసలు పరిష్కారం విడిపోవడంలో లేదు, జ్ఞానాన్ని సంపాదించుకోవడంలో ఉంది. జ్ఞానం యొక్క శక్తి ఏమిటో తెలుసుకుంటే జీవితం పూర్తిగా మారిపోతుంది.

పత్రి గారు చెప్పిందంతా జ్ఞానమే. నిజానికి జ్ఞాన బోధ కోసమే ఆయన ఈ భూమి పైకి వచ్చారు. చాలామంది ఆయన శాకాహారం గురించి బోధించడానికి వచ్చారని అనుకుంటారు. కానీ ఆయన "శాకాహార జగత్"

అని చెప్పినప్పుడు దాని వెనుక లోతైన అంతరార్థం ఉంది.

ఎందుకంటే శాకాహారం మనసును ప్రశాంతంగా ఉంచుతుంది, ధ్యానానికి అనుకూలమైన స్థితిని కలిగిస్తుంది, ఆ స్థితిలోనే జ్ఞానం వికసిస్తుంది. అందుకే శాకాహారాన్ని జ్ఞానానికి పునాదిగా చెప్పారు. అలాగే ఆయన "పిరమిడ్ జగత్" అని కూడా చెప్పారు. దాని అర్థం కేవలం పిరమిడ్లు నిర్మించుకోవడం కాదు, పిరమిడ్‌లో ధ్యానం చేయడం వల్ల మనస్సు త్వరగా ఏకాగ్రతను పొందుతుంది, దాని ద్వారా జ్ఞానం వేగవంతమవుతుంది. అందుకే పిరమిడ్‌ను కూడా జ్ఞాన సాధనకు సూచించారు.

ఈ జగత్తులో చాలామంది అజ్ఞానంలోనే జీవిస్తున్నారు. బయటకు చూస్తే ఎంతో అన్యోన్యంగా, సంతోషంగా కనిపిస్తారు, కానీ తలుపులు మూసిన తర్వాత నిజమైన పరిస్థితి బయటపడుతుంది. ఒకరి అభిప్రాయాలు మరొకరికి పూర్తిగా విరుద్ధంగా ఉంటాయి, ఒకరు మరొకరిని అర్థం చేసుకోలేరు, అదే ఎక్కువ కుటుంబాలలో కనిపించే వాస్తవం.

అందుకే పత్రి గారు చెప్పారు: **"భార్యాభర్తలిద్దరూ ధ్యానంలోకి వస్తే ఆ సంసారం స్వర్గంగా మారుతుంది"** అని. అలాగే మరో సందర్భంలో **"ఆత్మజ్ఞానం లేకపోతే బాంధవ్యాలు సరిగా ఉండవు"** అని కూడా చెప్పారు.

గుర్తుపెట్టుకోండి జ్ఞానం అంటే కేవలం పుస్తకాలు చదవడం కాదు. మీ కంటికి కనిపించని సత్యాల గురించి తెలుసుకోవడం. ముఖ్యంగా మరణానంతరం జరిగే విషయాల గురించి, ఆత్మ గురించి, జీవిత పరమార్థం గురించి అవగాహన పెంచుకోవడం. అంతేకాకుండా మీ జీవిత లక్ష్యానికి, మీ అంతిమ గమ్యానికి  దగ్గర అవ్వడం.

మనం గత కొన్ని రోజులుగా ముఖ్యమైన విషయాలను చర్చిస్తూ, అందులో భాగంగా మరణానంతర జీవితం గురించి మాట్లాడుకుంటున్నాం. **"మరణానంతర జీవితం గురించి మీకు ఎంత అవగాహన ఉంటే, మీరు మీ అసలు జీవిత లక్ష్యానికి అంత దగ్గరవుతారని చెప్పుకున్నాం".** ఇప్పుడు దీనిని ఇంకొంచెం వివరంగా అర్థం చేసుకుందాం.

# “నేను మరణించను, నాకు చావు లేదు”

ఎప్పుడైతే మీరు మరణించిన తర్వాత ఏమి జరుగుతుందో తెలుసుకుంటారో, అప్పుడు ముఖ్యంగా **“నేను మరణించను, నాకు చావు లేదు”** అనే విషయం చాలా స్పష్టంగా అర్థమవుతుంది.

ఇక్కడ ఒక విషయం గమనించండి, సాధారణంగా ఈ ప్రపంచంలో చాలామంది చావంటే చాలా భయపడతారు. చావు వస్తుందనే ఆలోచనే వారిని వణికిస్తుంది. కొన్నేళ్ల క్రితం కరోనా వచ్చినప్పుడు ఎంతమంది చావుకు భయపడ్డారో మనం చూశాం. అలాగే ఎవరికైనా హార్ట్ ఎటాక్ వచ్చినా, క్యాన్సర్ వచ్చినా, కిడ్నీ ఫెయిల్యూర్ అయినా, “నేను చనిపోతానేమో” అనే భయం కలుగుతుంది. కొందరు అయితే ఎంత డబ్బైనా ఖర్చు పెట్టడానికి సిద్ధపడతారు. కారణం మరణం అనేది పెద్ద నష్టం అని భావించడం వలన.

ఎవరైనా చనిపోతే వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా దుఃఖిస్తారు. ఎందుకంటే వారి దృష్టిలో ఆ వ్యక్తి ఇక లేడు అని. ఈ భావం ఎందుకు వస్తుంది అంటే, మరణించిన తర్వాత ఏమి జరుగుతుందో తెలియకపోవడం వల్ల. మరణం అనేది శాశ్వత నష్టాన్ని కలిగిస్తుంది అనే అభిప్రాయం వారిలో ఉండడం వల్ల వారు భయపడతారు.

కానీ మరణానంతర జీవితం గురించి మీకు అవగాహన ఉంటే మీ పరిస్థితి ఇంకోరకంగా ఉంటుంది. ఈ అవగాహన  మరణించిన వారికి, జ్ఞానికి ఉంటుంది. మరణించిన తర్వాత ఏమి జరుగుతుందో మరణించిన వ్యక్తికి తెలుస్తుంది కానీ జ్ఞాని జీవించి ఉండగానే మరణానంతరం జరిగేది తెలుసుకో గలుగుతాడు.

అందువల్ల జ్ఞాని తన జీవితాన్ని ఆ జ్ఞానానికి అనుగుణంగా మలుచుకొని ఎన్నో లాభాలు పొందుతాడు. మరణానంతర జీవితం గురించి

తెలుసుకోవడం వల్ల కలిగే మొదటి లాభం ఏమిటంటే, **"నేను చావను, నాకు చావు లేదు"** అనే సత్యం మీకు స్పష్టంగా అర్థమవుతుంది. అంతేకాదు, **"మరణించిన తర్వాత కూడా మీరు ఉంటారు"** అనే విషయం కూడా అర్థమవుతుంది.

సాధారణంగా చాలామంది "చనిపోతే ఇక నేను ఉండను" అని భావించి భయపడతారు. కానీ మరణానంతర జీవితం గురించి అవగాహన కలిగిన వ్యక్తి, మరణం తర్వాత కూడా తన ఉనికి కొనసాగుతుందని తెలుసుకుంటాడు. ఈ అవగాహన వల్ల మరణ భయం క్రమంగా తొలగిపోతుంది. ఎందుకంటే మరణం అంతం కాదు అని మీరు గ్రహిస్తారు.

అందుకే మరణానంతర జీవితం గురించి ఎంత ఎక్కువ తెలుసుకుంటే, అంత ఎక్కువ ధైర్యం, స్పష్టత, ఆత్మజ్ఞానం మీలో పెరుగుతాయి. అలాగే మీరు మీ జీవితాన్ని సరైన దిశలో నడిపించుకొని, మీ అసలు లక్ష్యానికి మరింత దగ్గరవుతారు.

మరణానంతర జీవితం గురించి తెలుసుకున్నప్పుడు, మరణించిన తర్వాత కూడా మీరు ఉంటారు అనే విషయం మీకు అర్థమవుతుంది. అంతేకాదు, ఈ విషయాలన్నీ అర్థం చేసుకోవడం వల్ల మీలో ఉన్న **"మరణ భయం కూడా తొలగిపోతుంది".**

మరణానంతర జీవితం గురించి అవగాహన కలిగిన వ్యక్తికి "నేను మరణించను, నాకు చావు లేదు" అనే విషయం స్పష్టంగా అర్థమవుతుంది. అలాగే, మరణించిన తర్వాత కూడా తన ఉనికి కొనసాగుతుందని గ్రహిస్తాడు. ఈ అవగాహన వల్ల మరణం పట్ల ఉన్న భయం పూర్తిగా తగ్గిపోతుంది.

అంతేకాదు, ఈ సత్యాన్ని తెలుసుకున్న వ్యక్తి మరణించిన వారి గురించి బాధపడడు, ఏడవడు. ఈ లక్షణం సాధారణంగా జ్ఞానులకు ఉంటుంది. ఎవరైనా మరణించినప్పుడు జ్ఞానులు ఎందుకు ఏడవరంటే, వారికి

ఆత్మ గురించి స్పష్టమైన అవగాహన ఉంటుంది.

ఎవరైనా మరణించినప్పుడు ఇతరులు దుఃఖిస్తున్నారని చూసి, జ్ఞాని మనసులో ఇలా అనుకుంటాడు: **"వారు ఆ వ్యక్తి ఇక లేదని భావించి బాధపడుతున్నారు, కానీ నిజానికి ఆత్మకు చావు లేదు. చావని వాడి గురించి చనిపోయాడని భావించి ఏడుస్తున్నారు"** అని.

పత్రి గారు కూడా **"ఎవరూ చచ్చినా చావరు"** అని చెప్పేవారు. ఈ విషయం ఎవరికి అర్థమవుతుంది అంటే, **"నేను దేహం కాదు, నేను ఆత్మను"** అని తెలుసుకున్నవారికి మాత్రమే అర్థమవుతుంది.

ఒకవేళ మీరు దేహమే నేను అని భావిస్తే, ఎవరైనా చనిపోయినప్పుడు "వాడు ఇక లేడు ఎలా?" అనే బాధ కలుగుతుంది. అందుకే చాలామంది ఏడుస్తారు. కానీ "నేను దేహం కాదు, ఆత్మను" అనే జ్ఞానం సంపాదించినవాడు ఆత్మకు చావు లేదని తెలుసుకుంటాడు. ఆత్మకు చావు లేనప్పుడు మరణం గురించి ఎందుకు బాధపడాలి?

ఒక సందర్భంలో ఒక మహిళ పత్రి గారి వద్దకు వచ్చి, "మా అమ్మ చనిపోయింది" అని ఏడుస్తూ కూర్చుంది. అప్పుడు పత్రి గారు ఆమెతో, "చనిపోయింది మీ అమ్మ కాదు, నీ బుద్ధి" అని అన్నారు. అంటే, "నీకు సరైన అవగాహన లేకపోవడం వల్లే మీ అమ్మ చనిపోయిందని అనుకుంటున్నావు. నీ బుద్ధి సరిగా పనిచేస్తే, మీ అమ్మకు చావు లేదని అర్థమవుతుంది. ఆమె ఆత్మ, ఆమె దేహం కాదు. ఈ విషయం నీకు అర్థమైతే నువ్వు ఏడవవు" అని వివరించారు.

ఇదే మరణానంతర జీవితం గురించి అవగాహన కలిగిన వ్యక్తి పొందే జ్ఞానం. అతనికి మరణించిన తర్వాత కూడా తన ఉనికి కొనసాగుతుందని స్పష్టంగా తెలుస్తుంది. మరి మనుషులు మరణానికి ఎందుకు భయపడతారు? ఎందుకు దుఃఖిస్తారు? కారణం, మరణం తమకు ఎంతో

నష్టాన్ని కలిగిస్తుందని భావించడం.

ప్రతి వ్యక్తి తన స్థాయిలో సంపాదిస్తాడు. ఇళ్ళు కడతాడు, వ్యాపారాలు పెడతాడు, ఆస్తులు కూడబెట్టుకుంటాడు. మరణం వచ్చినప్పుడు ఇవన్నీ వదిలి వెళ్ళాల్సి వస్తుందని భావించి భయపడతాడు, అందుకే బాధపడతాడు.

కానీ జ్ఞానం కలిగిన వ్యక్తి ఏమి చేస్తాడు? "ఈ శరీరం నేను కాదు" అని అర్థం చేసుకున్న తర్వాత, శరీరానికి ప్రాముఖ్యం తగ్గించి, ఆత్మకు ప్రాముఖ్యం ఇస్తాడు. శాశ్వతంగా ఉండే ఆత్మకు లాభం కలిగించే జ్ఞానాన్ని సంపాదించడానికి ప్రయత్నిస్తాడు.

ఎప్పుడైతే మీరు ఈ జ్ఞానాన్ని సమృద్ధిగా సంపాదించుకుంటారో, అప్పుడు మీకు ఎన్నో గొప్ప సత్యాలు స్పష్టంగా అర్థమవుతాయి. ఎప్పుడైతే మీరు ఈ జ్ఞానాన్ని  సంపాదించు కుంటారో, అప్పుడు మీకు మరణించిన తర్వాత ఇంకా ఉన్నతమైన లోకాలకు చేరుకుంటారని తెలుస్తుంది. అక్కడ ఎన్నో గొప్ప జ్ఞాన విషయాలను తెలుసుకునే అవకాశం లభిస్తుంది. అంతేకాదు, ఆ తర్వాత వచ్చే జన్మ కూడా ఇప్పటి జన్మ కంటే మరింత అద్భుతంగా ఉంటుంది. అందువల్ల మరణం అనేది నష్టం కాదు, లాభం అనే విషయం మీకు స్పష్టంగా అర్థమవుతుంది. లాభం కలిగించే దాని గురించి ఎందుకు బాధపడాలి? అందుకే **"జ్ఞానికి మరణం కూడా సంబరమే, పుట్టుక సంబరమే"** అని భావిస్తారు.

పుట్టుక ఎందుకు సంబరం అంటే, జ్ఞాని ఇలా ఆలోచిస్తాడు: **"ఈ దేహం ద్వారా నేను ఇంకా ఎన్నో అనుభవాలు పొందవచ్చు, ఎంతో సాధన చేయవచ్చు, ఎంతో జ్ఞానాన్ని పెంచుకోవచ్చు, భవిష్యత్తులో ఎన్నో లాభాలు పొందవచ్చు."** ఇటువంటి లాభాలను పొందడానికి అవసరమైన దేహాన్ని ధరించినందుకు పుట్టుక అతనికి సంబరంగా అనిపిస్తుంది.

మరి మరణం ఎందుకు సంబరం? చాలామందికి ఇది అర్థం కాదు.

కానీ జ్ఞానికి తెలుసు, **“ఈ శరీరం ఉన్నంతకాలం అతను సాధన చేశాడు, ఆత్మకు లాభం కలిగించే సేవలు చేశాడు, ఎన్నో గొప్ప పనులు చేశాడు. వాటి ఫలితంగా శరీరాన్ని విడిచిన తర్వాత ఇంకా ఉన్నతమైన లోకాలకు చేరుకుంటాడు, గతంలో ఉన్న స్థితి కంటే మరింత ఉన్నతమైన స్థితిని పొందుతాడు”.** ఎందుకంటే మరణానంతరం ఏమి జరుగుతుందో అతనికి అవగాహన ఉంటుంది.

అందువల్ల మరణం అతనికి నష్టాన్ని కలిగించదు. ఉన్న స్థితి నుంచి మరింత ఉన్నత స్థితికి చేరుకుంటే అది లాభమే కదా? అందుకే జ్ఞాని మరణాన్ని కూడా సంబరంగా స్వీకరిస్తాడు.

ఒకప్పుడు మీరు కూడా ధన సంపాదనకే ప్రాధాన్యం ఇచ్చి ఉండవచ్చు. ఎంతో డబ్బు సంపాదించి ఉండవచ్చు, ఆస్తులు కూడబెట్టుకుని ఉండవచ్చు, సౌకర్యాలు ఏర్పరచుకుని ఉండవచ్చు. అప్పుడు “ఇవి అన్నీ వదిలి వెళ్లాల్సి వస్తే?” అనే భయం సహజంగానే ఉంటుంది.

కానీ “నేను ఆత్మను” అనే జ్ఞానం వచ్చిన తర్వాత, ఇంతకాలం సంపాదించిన వాటిలో ఏదీ ఆత్మకు శాశ్వత లాభం కలిగించలేదని అర్థమవుతుంది. అప్పుడు ఆస్తుల మీద, సంపద మీద, మమకారం క్రమంగా తగ్గిపోతుంది. సంపాదన మీద ఉన్న అధిక ఆసక్తి కూడా తగ్గిపోతుంది.

ఆ తర్వాత మీరు ఆత్మకు లాభం కలిగించే జ్ఞాన సంపాదనను ప్రారంభిస్తారు, ఆత్మ సేవ చేయడం ప్రారంభిస్తారు. జ్ఞానాన్ని పంచడం, ఇతరులకు ఉపయోగపడే పనులు చేయడం, ఆధ్యాత్మిక సాధన చేయడం వంటి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఇలా సంవత్సరాలు గడిచే కొద్దీ మీలో సంతృప్తి పెరుగుతుంది, ధైర్యం పెరుగుతుంది, జ్ఞానం పెరుగుతుంది. జ్ఞానం పెరిగే కొద్దీ మరణానంతరం ఏమి జరుగుతుందో మరింత స్పష్టంగా అర్థమవుతుంది. ఈ జ్ఞానం వల్ల

ఉన్నత లోకాలను చేరుకునే అవకాశం ఉంటుందని, ఇంకా గొప్ప స్థితిని పొందవచ్చని గ్రహిస్తారు.

అందువల్ల మీరు ఇప్పుడే ధ్యానం చేస్తూ, జ్ఞానం సంపాదిస్తూ ఉంటే, భవిష్యత్తులో అది మీకు ఎంతో మేలు చేస్తుంది. ఒకవేళ శరీరాన్ని విడిచినా, మీరు సంపాదించిన జ్ఞానం మీతో ఉంటుంది. అదే మీకు ఉన్నతమైన స్థితిని, ఉన్నతమైన జన్మను లేదా అంతకంటే గొప్ప ఫలితాన్ని అందిస్తుంది.

అందుకే గుర్తుంచుకోండి **"జ్ఞానికి మరణం లాభం, అజ్ఞానికి మరణం నష్టం"**. ఎందుకంటే **"జ్ఞాని జ్ఞానాన్ని సంపాదిస్తాడు; అజ్ఞాని కేవలం ధనాన్ని మాత్రమే సంపాదిస్తాడు"**. ధనం సంపాదించినవాడు దానిని వదిలి వెళ్ళాల్సి వస్తుంది. కానీ జ్ఞానం సంపాదించినవాడు ఆ జ్ఞాన ఫలితాలను తనతో తీసుకెళ్తాడు.

అందుకే మరణం జ్ఞానికి సంబరం. ఉన్నత లోకాలు, ఉన్నత స్థితి, ఉన్నత జన్మ లభిస్తే అది లాభమే కదా? అందుకే మళ్ళీ మళ్ళీ గుర్తుంచుకోండి మీరు దేహం కాదు, మీరు ఆత్మ. **"దేహం కోసం ఆత్మను బలి చేయకండి, ఆత్మ కోసం దేహాన్ని ఉపయోగించుకోండి"**. అందుచేత మీకు జ్ఞానం కలిగితే ధ్యాన సాధన విలువ మీకు స్పష్టంగా అర్థమవుతుంది.


**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**
**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**
**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

| | |
|---|---|
| 1) జీవితశాస్త్రం (మొదటి భాగం) | - రూ.130/- |
| 2) జీవితశాస్త్రం (రెండవ భాగం) | - రూ.130/- |
| 3) జీవిత సత్యాలు | - రూ.130/- |
| 4) సత్యమార్గం | - రూ.160/- |
| 5) ధ్యాన శక్తి | - రూ.130/- |
| 6) ధ్యాన శాస్త్రం | - రూ.130/- |
| 7) ఆత్మ శాస్త్రం | - రూ.120/- |
| 8) మరణించక ముందే మరణించాలి | - రూ.130/- |
| 9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం | - రూ.120/- |
| 10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? | - రూ.120/- |
| 11) గీతాసందేశం | - రూ.120/- |
| 12) ఉపమాన ధ్యాన సందేశాలు | -రూ.110/- |
| 13) జీవిత సూక్ష్మాలు | - రూ.100/- |
| 14) భగవంతుడంటే | - రూ.100/- |
| 15) తెలుసుకోండి | - రూ.100/- |
| 16) మెహర్‌బాబా సందేశాలు | - రూ.100/- |
| 17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు | - రూ.100/- |
| 18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? | - రూ.100/- |
| 19) కోరికల వల్ల నష్టాలు | - రూ.100/- |
| 20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు | - రూ.100 |
| 21) కఠోపనిషత్తు | - రూ.90/- |
| 22) ఉపమాన జ్ఞాన సందేశాలు | -రూ.90/- |
| 23) ముఖ్యమైన సందేశాలు-1 | -రూ.80/- |
| 24) ముఖ్యమైన సందేశాలు-2 | -రూ.90/- |
| 25) కర్మ సిద్ధాంతం | - రూ.80/- |
| 26) ధ్యానమంటే ? | - రూ.80/- |
| 27) త్రివిధాలు | - రూ.80/- |
| 28) ఉత్తమ పురుషుడు | - రూ.80/- |
| 29) వశిష్ఠుల వారి సందేశాలు | - రూ.70/- |
| 30) శాస్త్రాల అర్థం- అంతరార్థం | - రూ.70/- |
| 31) ఆత్మజ్ఞానం ఎందుకు? | - రూ.70/- |
| 32) జ్ఞాన జ్యోతి | - రూ.70/- |
| 33) జ్ఞాన కుసుమాలు | - రూ.70/- |
| 34) మరణం తర్వాత కూడా వచ్చేవి | - రూ.70/- |
| 35) షిరిడీ సాయి సందేశాలు | - రూ.70/- |
| 36) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య | - రూ.70/- |
| 37) బుద్ధుని సందేశాలు | - రూ.70/- |
| 38) భూతదయే దైవత్వం | - రూ.70/- |
| 39) ఆత్మహంతకులంటే ఎవరు? | - రూ.70/- |
| 40) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి | - రూ.70/- |
| 41) ధర్మ సూక్ష్మాలు | - రూ.70/- |
| 42) ఆశ్చర్యకరమైన విషయాలు | -రూ.70/- |
| 43) మానవునిలోని చెడు | -రూ.70/- |
| 44) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు | -రూ.70/- |
| 45) చివటం అమ్మవారి సందేశాలు | - రూ.70/- |
| 46) మోక్షం అంటే? | - రూ.70/- |
| 47) కబీరు సందేశాలు-1 | -రూ.70/- |
| 48) మనసు-1 | - రూ.70/- |
| 49) మనసు-2 | - రూ.70/- |
| 50) మరణానంతరం జరిగేది-1 | - రూ.60/- |
| 51) మరణానంతరం జరిగేది-2 | - రూ.70/- |
| 52) మరణానంతరం జరిగేది-3 | - రూ.60/- |
| 53) కబీరు సందేశాలు-2 | - రూ.60/- |
| 54) దుఃఖ నివారణామార్గం | - రూ.60/- |
| 55) బ్రహ్మజ్ఞానం | - రూ.60/- |
| 56) ధ్యానం (పత్రీజీ) | - రూ.60/- |
| 57) ధ్యానం వల్లనే జ్ఞానం | - రూ.60/- |
| 58) అతీంద్రియ శక్తులు | - రూ.60/- |
| 59) ఆలోచించండి | - రూ.60/- |
| 60) నిర్వాణ మార్గం | - రూ.60/- |
| 61) ధ్యానులకు సూచనలు | - రూ.60/- |
| 62) యోగీశ్వరుల సందేశాలు | - రూ.60/- |
| 63) మమకారం | - రూ.60/- |
| 64) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 | - రూ.60/- |
| 65) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 | - రూ.50/- |
| 66) మాస్టర్‌గా ఎదగాలంటే? | - రూ.50/- |
| 67) భగవంతుని ఇష్టులవ్వాలంటే | - రూ.50/- |
| 68) సంకల్పమంటే? | - రూ.50/- |
| 69) ఈ జీవితం ఎందుకు? | - రూ.50/- |
| 70) ఆశ్చర్యం... ఆశ్చర్యం | - రూ.50/- |
| 71) మూడురకాల భవిష్యత్తులు | - రూ.50/- |
| 72) అరిహంత్ | - రూ.50/- |
| 73) బుద్ధి వికసించిన వారి ప్రవర్తన | - రూ.50/- |
| 74) భార్యభర్తలు గొడవ పడకూడదంటే | - రూ.40/- |
| 75) విదురుని సందేశాలు | - రూ.40/- |
| 76) మూడురకాల జీవితాలు | - రూ.40/- |
| 77) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే | - రూ.40/- |
| 78) ఛాంపియన్ అవ్వాలంటే? | - రూ.40/- |
| 79) బ్రహ్మం అంటే? | - రూ.40/- |
| 80) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం | - రూ.40/- |
| 81) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం | - రూ.40/- |
| 82) మహాత్ముల సందేశాలు | - రూ.40/- |
| 83) సత్యం | - రూ.40/- |
| 84) చక్రాలు | - రూ.40/- |
| 85) గురువును గుర్తించడం ఎలా? | - రూ.40/- |
| 86) భాగవత సన్నివేశాల అంతరార్థం | - రూ.40/- |
| 87) మౌన ధ్యానం | - రూ.40/- |
| 88) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? | - రూ.20/- |
| 89) శాకాహారమే మానవాహారం | - రూ.15/- |
| 90) అహింస మరియు శాఖాహారం | - రూ.15/- |



మరణానంతర జీవితం గురించి ఎంత అవగాహన పెంచుకుంటారో, మీ ప్రవర్తనలో, మాటల్లో, జీవితంలో అంత మార్పు వస్తుంది. మీ లక్ష్యం ఏమిటో అర్థమవుతుంది. ఆ లక్ష్యం వైపు ప్రయాణిస్తారు. చివరకు దాన్ని సాధిస్తారు కూడా.

అయితే ఆ లక్ష్యం ఏమిటి? పూర్ణాత్మ స్థితిని చేరుకోవడం, పూర్ణ జ్ఞానాన్ని సంపాదించుకోవడం. ఆ లక్ష్యాన్ని సాధించడానికి అత్యంత అవసరమైనది మరణానంతర జీవితం మీద స్పష్టమైన అవగాహన. ఈ అవగాహన ఎంత పెరుగుతుందో, అంతగా మీరు మీ అసలు గమ్యానికి చేరువ అవుతారు. మరణానంతర జీవితం గురించి అవగాహన లేకుండా, ఈ ప్రపంచంలో ఎన్ని విద్యలు నేర్చుకున్నా, ఎన్ని సంపదలు సంపాదించినా, ఎన్ని విజయాలు సాధించినా వాటి వల్ల సంపూర్ణ ప్రయోజనం ఉండదు. మీ జీవితంలో కొంత సమయాన్ని మరణానంతర జీవితం గురించి తెలుసుకోవడానికి కేటాయించండి. మీ లక్ష్యం పూర్ణాత్మ స్థితిని చేరుకోవడం. జ్ఞానం పెరిగితే కర్మలు తగ్గుతాయి, కర్మలు తగ్గితే గమ్యానికి చేరువ అవుతారు.

- బ్రహ్మర్షి తటవర్తి వీర రాఘవరావు

రూ.60/-


**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
| --- | --- | --- | --- | --- |